ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 122, పేజీలు - 08

సోమవారం,నవంబర్ 2, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

2024 ఎన్నికలు చెల్లవు..

జ్ఞానేశ్ కుమార్ జైలుకు వెళ్తారు



జ్ఞానేశ్ కుమార్ తర్వాత మీ వంతే మోదీజీ

- ఢిల్లీ సభలో రాహుల్ గాంధీ హెచ్చరిక!
- జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి జైలుకు పంపిస్తామన్న రాహుల్
- 'ఆయన తర్వాత మీ వంతే' అంటూ ప్రధానికి హెచ్చరిక
- 2024 ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని ఆరోపణ
- 15 శాతం ఓటర్ల పేర్లు తొలగించారని వ్యాఖ్య
- దేశ సంపద కొంత మంది చేతుల్లోనే ఉందని విమర్శ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం ఇండియా కూటమి నిర్వహించిన బహిరంగ సభలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఆయనను సీఈసీ పదవి నుంచి తొలగిస్తామని చివరకు జైలుకు కూడా వెళ్లాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఈవీఎంలు, ఓటర్ల జాబితాల అవకతవకల ద్వారా ఓట్ల చోరీ జరిగిందని సంచలన ఆరోపణలు చేశారు. ఈ క్రమంలోనే 2024 ఎన్నికల ప్రక్రియనే అక్రమమని అభివర్ణించారు. ఓటు చోరీ అనేది సాధారణ దొంగతనం కాదని దేశంలోని ప్రతి పౌరుడి గొంతును దొంగిలించడమేనని అన్నారు. దీన్ని దేశద్రోహంతో పోల్చారు. 2024 ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా, ఓటర్ల జాబితాలను మార్చడం ద్వారా అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఎన్నికల తర్వాత 15 శాతం మంది ఓటర్ల పేర్లు తొలగించారని ఇండియా కూటమి, ఎన్డీయే మధ్య ఓట్ల తేడా 3 శాతమే ఉందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ గణాంకాల ఆధారంగానే 2024 ఎన్నికలు చట్టబద్ధమైనవి కావంటూ తన వాదనను వినిపించారు. ఈ సభలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు

2లో..

రైళ్లు ఆపినా.. కాంగ్రెస్ సైన్యాన్ని

ఎవరూ ఆపలేరు

- రావణ మోదీని ఓడించేందుకు మా వానర సేన వచ్చిందన్న రేవంత్



న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన ఓటు చోరీ వ్యతిరేక నిరసనకు తెలంగాణ నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. ప్రత్యేక రైళ్లను రద్దు చేసినప్పటికీ వెనక్కి తగ్గకుండా బస్సులు, సొంత వాహనాల్లో ఢిల్లీకి చేరుకున్న నాయకులను సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ఢిల్లీకి రాకుండా రైళ్లు ఆపినా ఇక్కడికి చేరుకోకుండా తెలంగాణ కాంగ్రెస్ సైన్యాన్ని ఆపలేకపోయారని రేవంత్ వ్యాఖ్యానించారు. తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలను రావణాసురుడిపై పోరాటానికి కదిలిన రాముడి సైన్యంతో పోల్చారు. దేశవ్యాప్తంగా 13.5 కోట్ల పేదలు, బహుజనుల ఓట్లను తొలగించారని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలపై మండిపడ్డారు. పేదల ఓటు హక్కును, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వరకు కాంగ్రెస్ చేస్తున్న ధర్మపోరాటం ఆగదని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలోని తెలంగాణ భవన్ నుంచి రాంలీలా మైదానం వైపు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు భారీ ర్యాలీగా బయలుదేరారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు పలువురు

2లో..

హారన్ల హోరు..

హైదరాబాద్ బేజారు!

- హద్దులు దాటుతున్న శబ్ద కాలుష్యం
- హారన్ల హోరుతో నగరం ఉక్కిరిబిక్కిరి
- 110 డెసిబెల్స్ వరకు శబ్ద తీవ్రత
- నివాస, వాణిజ్య, నిశ్శబ్ద ప్రాంతాల్లోనూ వదలని వైనం

(గౌటీ బాల సాయి తిలక్ - ప్రశ్న న్యూస్)



మహానగరం శబ్ద కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. వాహనాల రణగొణ ధ్వనులు, అనవసర హారన్ల మోతతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నివాస ప్రాంతాల నుంచి వాణిజ్య కూడళ్ల వరకు, చివరకు నిశ్శబ్ద ప్రాంతాలుగా ప్రకటించిన జోన్లలోనూ శబ్ద కాలుష్యం హద్దులు దాటుతోంది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి 2026 జనవరి నుంచి జులై వరకు సేకరించిన గణాంకాలు నగరంలో పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి. పలు ప్రాంతాల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా అనుమతించిన ప్రమాణాలకు

2లో..

కేంద్ర ఖజానాకు

కాసుల వర్షం

- 23 శాతం పెరిగిన జీఎస్టీ వసూళ్లు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు భారీగా పెరిగాయి. గతేడాది ఇదే నెలతో పోలిస్తే అక్టోబర్‌లో 22.9 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం వసూళ్లు రూ.2.31 లక్షల కోట్లకు చేరాయి. దేశీయ ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడంతో పాటు దిగుమతులపై పన్ను ఆదాయం పెరగడం ఇందుకు దోహదం చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. గతేడాది అక్టోబర్‌లో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1.88 లక్షల కోట్లు కాగా, ఈ ఏడాది రూ.2.31 లక్షల కోట్లకు చేరాయి. రిఫండ్లు మినహాయించగా నికర ఆదాయం 25.6 శాతం పెరిగి రూ.2.03 లక్షల కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే నెలలో ఇది రూ.1.61 లక్షల కోట్లుగా ఉంది. దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ ఆదాయం 15.8 శాతం పెరిగి రూ.1.59 లక్షల కోట్లకు చేరింది. దిగుమతులపై పన్ను వసూళ్లు మాత్రం 42.2 శాతం దూసుకెళ్లి రూ.72,246 కోట్లకు చేరాయి. గతేడాది అక్టోబర్‌లో దిగుమతులపై

2లో..

ఏపీలో ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్

- ఎస్ఈసీ అనిల్ పునేఠా ప్రెస్ మీట్
- పల్నాడు, అనంతపురం జిల్లాల్లో కొన్ని ఘటనలు జరిగాయని వెల్లడి
- విజయవాడలో పోలింగ్ ఆలస్యం కావడంతో సమయం పొడిగింపు
- అధికారుల నుంచి నివేదికలు వస్తేనే చర్యలుంటాయని స్పష్టం చేసిన పునేఠా



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ స్వల్ప ఘటనలు మినహా చాలావరకు ప్రశాంతంగా ముగిసిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ కుమార్ పునేఠా వెల్లడించారు. పల్నాడు, అనంతపురం జిల్లాల్లో కొన్ని హింసాత్మక ఘటనలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీల నుంచి నివేదికలు అందిన తర్వాత రీపోలింగ్‌పై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. మధ్యాహ్నం 3 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 48.03 శాతం పోలింగ్ నమోదైందని ఆయన తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పోలింగ్ సరళిని వివరించారు. పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించామని, ఉదయం నుంచి శ్రీకాకుళం, పల్నాడు, కడప సహా పలు జిల్లాల నుంచి వివిధ పార్టీల ప్రతినిధులు వచ్చి ఫిర్యాదులు అందజేశారని పునేఠా తెలిపారు."ఉదయం 13,500 కెమెరాల ద్వారా వెబ్ కాస్టింగ్ పర్యవేక్షించాం. ప్రత్యేకించి పల్నాడు, అనంతపురం జిల్లాల్లో

2లో..

బియ్యం ధరలకు కళ్లెం!

- ఎంఆర్‌పీ దాటితే కఠిన చర్యలు.. అక్రమార్కులపై కేసులు
- సన్నబియ్యం గరిష్ఠ విక్రయ ధరలు ఖరారు చేసిన ప్రభుత్వం
- దుకాణాల్లో ధరల పట్టిక ప్రదర్శన తప్పనిసరి.. తనిఖీలు ముమ్మరం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బియ్యం ధరలకు కళ్లెం వేసేందుకు తెలంగాణ పౌరసరఫరాల శాఖ రంగంలోకి దిగింది. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టిస్తూ ఇష్టారాజ్యంగా ధరలు పెంచుతున్న రైస్‌మిల్లర్లు, ట్రేడర్లపై ప్రభుత్వం కొరడా ఝళిపించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రైస్‌షాపులు, గోదాముల్లో తనిఖీలు చేపట్టిన అధికారులు

2లో..

ఫోన్ ట్యాపింగ్ కేసులో

సంచలనం

- హరీశ్ రావుపై సిద్దిపేటలో ఎఫ్ఐఆర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుపై సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదైంది. గతంలో హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును సిద్దిపేటకు బదిలీ చేయడంతో పోలీసులు కొత్త క్రైమ్ నంబర్‌తో కేసు రిజిస్టర్ చేశారు. అంతేకాకుండా పాత ఎఫ్ఐఆర్‌లో లేని మరో ఆరు సెక్షన్లను అదనంగా చేర్చడం ఈ వ్యవహారంలో ఇప్పుడు తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ కేసు వెనుక ఉన్నది సిద్దిపేటకు చెందిన గాదగోని చక్రధర్‌గౌడ్ చేసిన ఫిర్యాదు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన ఫోన్‌తో పాటు తన భార్య ఫోన్‌ను కూడా అక్రమంగా ట్యాప్ చేశారని ఆయన ఆరోపించారు. తన కుటుంబ సభ్యుల ఫోన్లపైనా నిఘా పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు 2024 డిసెంబర్ 1వ తేదీన

2లో..

ముంచుకొస్తున్న

'మురసు' తుపాను

- నెల్లూరుకు 630 కి.మీ దూరంలో కేంద్రీకృతం



అమరావతి (ప్రశ్న న్యూస్) అర్నబ్ తుపాను విధ్వంసం నుంచి ఇంకా బయటపడక ముందే ఏపీ వైపు మరో తుపాను దూసుకొస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్రవాయుగుండం గడిచిన 6 గంటల్లో గంటకు 23 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తోందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఇది చెన్నైకి 700

2లో..

పులివెందులలో ఠీపోలింగ్‌కు

వైఎస్ జగన్ డిమాండ్

- ఆర్వో కార్యాలయం వెలుపల బైఠాయించి నిరసన



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యం ఉందా? అని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని చంద్రబాబు సర్కార్ ఖూనీ చేస్తుందని వైఎస్ జగన్ ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వైఎస్ జగన్ పులివెందుల చేరుకున్నారు.

2లో..

జనగణనకు ముందే ఓబీసీలపై

నిర్ణయం తీసుకోండి

- సీఎం రేవంత్‌కు కవిత బహిరంగ లేఖ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఓబీసీల కులగణన, ఆదివాసీల మతాన్ని జనగణనలో ప్రత్యేకంగా నమోదు చేసే అంశాలపై అసెంబ్లీ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. డిసెంబరులో ఇంటింటి జనగణన ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఓబీసీల జనాభాను ప్రత్యేకంగా లెక్కించడం, ఆదివాసీల ప్రత్యేక మత, సాంస్కృతిక గుర్తింపును జనగణనలో

2లో..

2024 ఎన్నికలు చెల్లవు..జ్ఞానేశ్ కుమార్ జైలుకు వెళ్తారు

తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆయన పదవిలో కొనసాగడానికి వీల్లేదని భవిష్యత్తులో పదవి నుంచి తొలగించబడతారని అన్నారు. అంతేకాకుండా జైలుకు వెళ్లాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్ కుమార్ లేకపోతే నరేంద్ర మోదీ ప్రధానమంత్రి, అమిత్ షా కేంద్ర హోంమంత్రి అయ్యేవారు కాదని ఆరోపించారు.దేశంలోని విద్యా వ్యవస్థ నుంచి దర్యాప్తు సంస్థల వరకు అనేక రాజ్యాంగ, ప్రభుత్వ సంస్థలపై ఆర్ఎస్ఎస్ ప్రభావం పెరిగిందని రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. దీని వల్ల రైతులు, కార్మికులు, యువతకు రావాల్సిన హక్కులు దక్కడం లేదని అన్నారు. డబ్బు, అధికారంతో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగ ప్రాధాన్యతను వివరించిన రాహుల్ గాంధీ ఎంతటి ఆర్థిక శక్తి ఉన్నా రాజ్యాంగం కంటే ఎవరూ గొప్పవారు కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అంతం చేయడానికి తాము అనుమతించబోమని స్పష్టం చేశారు.కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రంతో పాటు మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్‌లోని ప్రభుత్వాలు కూడా ఓట్ల చోరీ ద్వారానే బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ప్రజలు వారిని ఎన్నుకోవడం లేదని.. వారే తమకు తాముగా అధికారాన్ని కట్టబెట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మోదీ ప్రధాని పదవి నుంచి దిగిపోతేనే ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందని అన్నారు. ఈ సభకు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ సహా ఇండియా కూటమికి చెందిన పలువురు నాయకులు హాజరయ్యారు. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఎన్నికల సంఘం పనితీరుపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఇండియా కూటమి ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. అంతకుముందు మింటో రోడ్-కనాట్ ప్లేస్ కూడలి నుంచి 'చలో ఢిల్లీ' పేరుతో ర్యాలీ ప్రారంభమై రామ్‌లీలా మైదానానికి చేరుకుంది. అక్టోబర్ 31వ తేదీన సీఈసీకి వ్యతిరేకంగా నిర్వహించిన ప్రతీకాత్మక అభిశంసన కార్యక్రమం తర్వాత ఈ భారీ సభ జరిగింది.

బీజేపీ ఎదురుదాడి.. ఎస్ఐఆర్‌కు మద్దతుగా కేంద్ర మంత్రి మరోవైపు ఇండియా కూటమి ఆరోపణలను బీజేపీ నేతలు ఖండించారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసం కోల్పోయాయని బీజేపీ నేత ధర్మేంద్ర ప్రధాన్ విమర్శించారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో.. అరాజకతా హటావో' పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందని ఆరోపించారు. కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థించారు. ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేయడం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాల్లో దేశంలో భారీగా వలసలు, పట్టణీకరణ జరిగాయని, ఒకే వ్యక్తి పాత నివాస ప్రాంతంతో పాటు కొత్త ప్రాంతంలోనూ ఓటరుగా నమోదయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు. గత 20 ఏళ్లలో సుమారు 40 కోట్ల మంది వలస వెళ్లగా దాదాపు 20 కోట్ల మంది మరణించారని కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ వివిధ దశల్లో సుమారు 13 కోట్ల ఎంట్రీలను తొలగించగా అందులో 2.8 కోట్ల మంది మరణించిన వారి పేర్లు ఉన్నాయని మరో 1.9 కోట్ల కొత్త పేర్లను చేర్చినట్లు వివరించారు. అనర్హుల పేర్ల తొలగింపు, అర్హులైన కొత్త ఓటర్ల నమోదుతో ఎన్నికల జాబితాలను ప్రక్షాళన చేయడమే ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ లక్ష్యమని చెప్పారు.

ఎన్నికల సంఘం వాదన.. ప్రతిపక్షాల ఆందోళన ఓటర్ల జాబితాల సవరణపై ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా ఎన్నికల సంఘం మాత్రం ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం లేదని స్పష్టం చేస్తోంది. పొరపాటున పేర్లు తొలగించబడిన ఓటర్లు తిరిగి నమోదు చేసుకోవచ్చని పేర్కొంటోంది. మరోవైపు ఎస్ఐఆర్‌లో పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించడం, ఓటర్ల నమోదు ప్రక్రియలో పారదర్శకతపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. దీంతో దేశంలో ఎన్నికల సంస్కరణలు, ఓటర్ల జాబితాల ప్రక్షాళన, ఎన్నికల సంఘం జవాబుదారీతనం వంటి అంశాలు రాజకీయ చర్చలో కీలకంగా మారాయి.

ఏపీలో ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్

హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందాయి. లా అండ్ ఆర్డర్‌కు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని మూడు రోజుల క్రితమే కలెక్టర్లు, ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. ప్రశాంత వాతావరణం ఉంటేనే ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకుంటారు" అని ఆయన అన్నారు. మీడియా సమావేశానికి ముందు తాను నంద్యాల, కడప, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అనంతపురం, కర్నూలు, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించినట్లు చెప్పారు. చాలా జిల్లాల్లో ఎలాంటి హింస జరగలేదని కలెక్టర్లు నివేదించినట్లు తెలిపారు.విజయవాడలోని 55వ వార్డులో సాంకేతిక కారణాల వల్ల పోలింగ్ రెండున్నర గంటలు ఆలస్యంగా ప్రారంభమైందని, దీంతో జిల్లా కలెక్టర్ అభ్యర్థన మేరకు అక్కడ పోలింగ్ సమయాన్ని సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు పొడిగించినట్లు పునేతా వెల్లడించారు. ఓటర్లకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్‌కు ఉన్న అధికారాలను ఉపయోగించి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పల్నాడు, అనంతపురం జిల్లాల్లో జరిగిన ఘటనలపై పోలింగ్ సిబ్బంది సాయంత్రం రిసెప్షన్ సెంటర్లకు చేరుకున్నాక, ప్రిసైడింగ్ అధికారుల (పీవో) నుంచి లిఖితపూర్వక నివేదికలు తీసుకుంటామని ఎస్ఈసీ స్పష్టం చేశారు."నివేదికలు, వెబ్ కాస్టింగ్ ఫుటేజీని పరిశీలించి, ఫిర్యాదుల్లో వాస్తవం ఉందని తేలితే తక్షణమే రీపోలింగ్‌పై ఆదేశాలు జారీ చేస్తాం. రేపు రీపోలింగ్ నిర్వహించి, ఎల్లుండి కౌంటింగ్ చేపట్టాల్సి ఉన్నందున ఈరోజే నిర్ణయం ఉంటుంది. కేవలం ఆరోపణలు, ఫిర్యాదుల ఆధారంగా ఆదేశాలివ్వలేను. నేను ఇచ్చే ప్రతి ఉత్తర్వు న్యాయసమీక్షకు లోబడి ఉంటుంది. కలెక్టర్, ఎస్పీ నుంచి ఆధారం వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాను," అని పునేతా వివరించారు. గతంలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్న అన్నమయ్య జిల్లాలో ఈసారి పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, మదనపల్లెలో కేవలం మూడు చిన్న ఫిర్యాదులు మాత్రమే వచ్చాయని కలెక్టర్ తెలిపినట్లు చెప్పారు. పులివెందులలో జరిగిన ఒక ఘటనపై నివేదిక అందాల్సి ఉందన్నారు. 70 చోట్ల వైసీపీ ఏజెంట్లు లేరన్న ఫిర్యాదుపై వెంటనే స్పందించి, వారికి పోలీస్ ఎస్కార్ట్ ఏర్పాటు చేయాలని ఎస్పీని ఆదేశించినట్లు తెలిపారు.తాను నిష్పక్షపాతంగా, నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నానని, టీడీపీ, వైసీపీ రెండు పార్టీలూ తనపై ఫిర్యాదులు చేస్తున్నాయంటే తాను ఎవరికీ కొమ్ము కాయడం లేదని అర్థమని పునేతా వ్యాఖ్యానించారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 63.8 శాతం పోలింగ్ నమోదైందని, ఈసారి తుది పోలింగ్ శాతం వివరాలు సోమవారానికి వెల్లడవుతాయని ఆయన తెలిపారు.

కేంద్ర ఖజానాకు కాసుల వర్షం

ఐజీఎస్టీ వసూళ్లు రూ.50,796 కోట్లుగా ఉన్నాయి.

ఏడు నెలల్లో రూ.14.77 లక్షల కోట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27లో ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు స్థూల జీఎస్టీ వసూళ్లు 13.2 శాతం పెరిగి రూ.14.77 లక్షల కోట్లకు చేరాయి. గతేడాది ఇదే కాలంలో ఇవి రూ.13.05 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. నికర వసూళ్లు సైతం 12.6 శాతం వృద్ధితో రూ.12.69 లక్షల కోట్లకు చేరాయి. అక్టోబర్‌లో పన్ను రిఫండ్లు 6.5 శాతం పెరిగి రూ.27,934 కోట్లకు చేరాయి. దేశీయ రిఫండ్లు రూ.14,007 కోట్లు కాగా, ఎగుమతులకు సంబంధించిన రిఫండ్లు రూ.13,927 కోట్లుగా నమోదయ్యాయి. ఏప్రిల్-అక్టోబర్ మధ్య మొత్తం రిఫండ్లు 16.9 శాతం పెరిగి రూ.2.08 లక్షల కోట్లకు చేరాయి.

పులివెందులలో రీపోలింగ్‌కు వైఎస్ జగన్ డిమాండ్

ఈ క్రమంలోనే వైఎస్ జగన్ అక్కడ మీడియాతో మాట్లాడుతూ పులివెందులలో మొత్తం 80 బూత్‌ల్లో 70 చోట్ల వైసీపీ ఏజెంట్లు లేకుండా చేశారని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అధికార పార్టీకి పోలీసులు సహకరిస్తున్నారని ఆరోపణలు చేశారు. పులివెందులలో రీ పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు."యథేచ్ఛగా దొంగ ఓట్లు వేస్తున్నారు. ఎస్పీలు, కలెక్టర్లకు ఫోన్ చేసినా స్పందన లేదు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు లేకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు?. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ప్రమీలమ్మపై దాడి చేశారు. పోలింగ్ బూత్‌లకు వచ్చే ఓటర్ల స్లిప్పులను బలవంతంగా లాక్కొని వెనక్కి పంపారు. మీ ఓటు పడిపోయిందంటూ ఓటర్లను వెనక్కి పంపేశారు. కౌన్సిలర్ అభ్యర్థులను బలవంతంగా అరెస్టులు చేశారు. ఎన్నికల అక్రమాలను చిత్రీకరిస్తున్న విలేకరుల మీద దాడులు చేస్తున్నారు. కెమెరాలు, సెల్ ఫోన్లు ధ్వంసం చేస్తున్నారు. ఓటర్లు మమ్మల్ని ఓటు వేయనియ్యడం లేదని ధర్నాలు చేస్తుంటే కూడా పట్టించుకోవడం లేదు. ఓటర్లు ధర్నా చేస్తే, కనీసం వాళ్ళను పిలుచుకొని పోయి ఓట్లు వేయించే కార్యక్రమం కూడా జరగడం లేదు. ఇంత దారుణమైన పరిస్థితి ఉంది. కేవలం నా ఇల్లు ఇక్కడ, నా ఓటు ఇక్కడ కాబట్టి ఈ బూత్‌లలో మాత్రమే ఏజెంట్లను కూర్చోబెట్టారు. 80 బూత్‌లలో కేవలం 10 బూతుల్లో మాత్రమే వైసీపీ ఏజెంట్లు ఉన్నారు. పులివెందుల, కడప, జమ్మలమడుగు, చిత్తూరు, మాచర్ల, చిలకలూరిపేట, తాడిపత్రి, మదనపల్లె, చీమకుర్తి.. అన్ని చోట్ల కూడా ఇవే పరిస్థితులే కనిపిస్తున్నాయి" అని వైఎస్ జగన్ అన్నారు.అనంతరం వైఎస్ జగన్ వైసీపీ ఏజెంట్లతో కలిసి పులివెందుల పురపాలక సంఘం కార్యాలయానికి వెళ్లి ఆర్‌వో కలిశారు. కార్యాలయం ఆవరణలో ఆర్వో చిన్నయ్యకు వైఎస్ జగన్ వినతిపత్రం అందజేశారు. పులివెందులలో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అయితే తమను కార్యాలయంలోనికి అనుమతించడం లేదని, వైఎస్ జగన్ కార్యాలయం వెలుపల బైఠాయించారు. వైసీపీ శ్రేణులతో కలిసి వైఎస్ జగన్ నిరసనకు దిగారు."మీకు పై నుంచి ఆదేశాలు ఏమైనా రావొచ్చు, కానీ మీ అధికారం వినియోగించుకోవాలి. రీపోలింగ్ నిర్వహించేలా అధికారులు నిర్ణయం తీసుకోవాలి" అని ఆర్వోతో వైఎస్ జగన్ అన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ బీహార్‌లో పరిస్థితులను ఏపీలో చూస్తున్నామని తెలిపారు. మాజీ సీఎం నియోజకవర్గంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే, ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ఏమిటో ఆలోచన చేయాలని కోరారు. పులివెందులలో వాళ్లకు నచ్చినట్టుగా ఓట్లు వేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో అక్రమాలపై ఆధారాలన్నీ ఉన్నాయని చెప్పారు. ఈ ప్రభుత్వం ఏం చేసినా ఇక రెండేళ్లేనని ఆ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని అన్నారు. ఇప్పుడు జరిగిన అన్ని ఘటనలపై తమ ప్రభుత్వంలో విచారణ చేయిస్తామని చెప్పారు. ఇలాంటి పరిస్థితులు ఉంటే భవిష్యత్తులో ఇక ఎన్నికలు జరగవని అన్నారు. తాము ఇక్కడే కూర్చుంటామని, లాఠీఛార్జి చేసుకుంటే చేసుకోండని అన్నారు.

బియ్యం ధరలకు కళ్లెం!

తాజాగా మిల్లర్లు, వ్యాపారులతో సమావేశమై సన్నబియ్యం గరిష్ఠ విక్రయ ధరలను ఖరారు చేశారు. నిర్ణయించిన ధరలకు మించి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యమైన సన్నబియ్యం ధరలు కిలోకు రూ.75 నుంచి రూ.95 వరకు పలుకుతున్నాయి. ఈ పరిస్థితిపై స్పందించిన పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బీపీటీ బియ్యం కిలో ధర రూ.66 మించకుండా చూడాలని సూచించారు. ఈ నేపథ్యంలో వివిధ రకాల సన్నబియ్యానికి గరిష్ఠ విక్రయ ధరలను నిర్ణయించారు.
సన్నబియ్యం గరిష్ఠ ధరలు (కిలోకు): హెచ్‌ఎంటీ, జేఎస్ఆర్: రూ.79 ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా: రూ. 74 బీపీటీ, కేఎన్ఎం: రూ. 66 దుకాణాల్లో ధరల పట్టిక తప్పనిసరి పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సూచనల మేరకు డైరెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ మిల్లర్లు, ట్రేడర్లతో సమావేశమయ్యారు. దేశంలో వరి సాగు, దిగుబడి, ధాన్యం సేకరణలో ముందున్న తెలంగాణలో బియ్యం ధరలు భారీగా పెరగడం సమంజసం కాదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. వ్యాపారులు తమ లాభాల మార్జిన్లను పరిగణనలోకి తీసుకుంటూనే వినియోగదారులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని స్పష్టం చేశారు. నిర్ణయించిన ధరల పట్టికను ప్రతి దుకాణంలో వినియోగదారులకు కనిపించేలా తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు.

అక్రమార్కులపై 420 కేసులు

మరోవైపు ధరల నియంత్రణతో పాటు అక్రమ విక్రయాలపై అధికారులు దృష్టి సారించారు. శనివారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో పలు అక్రమాలు వెలుగుచూశాయి. బియ్యం బస్తాలపై ముద్రించిన బరువు కంటే తక్కువగా సరుకు ఉండటం, ఎంఆర్‌పీ స్టిక్కర్లను మార్చి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మోసాలకు పాల్పడిన ట్రేడర్లపై 420 కేసులతో పాటు నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అధికారి శశిధర్‌రాజు వెల్లడించారు.

తనిఖీలకు ఆటంకాలు.. అయినా వెనక్కి తగ్గం!

తనిఖీల సమయంలో అధికారులు కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తనిఖీలు జరుగుతున్న ప్రాంతాల్లో పక్కనే ఉన్న కొన్ని దుకాణాల యజమానులు ముందస్తుగా అప్రమత్తమై షాపులు మూసేసి వెళ్లిపోతున్నట్లు గుర్తించారు. మరోవైపు తనిఖీ సిబ్బంది కొరత కూడా సమస్యగా మారింది. అయినప్పటికీ బియ్యం ధరల నియంత్రణ, అక్రమ నిల్వలు, అధిక ధరల విక్రయాలను అరికట్టేందుకు తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలనం

హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదు ఆధారంగా అప్పట్లో క్రైమ్ నంబర్ 1205/2024 కింద పోలీసులు కేసు నమోదు చేశారు.ఆ సమయంలో ఈ కేసులో హరీశ్‌రావును ఏ1గా అప్పటి మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును ఏ2గా పేర్కొన్నారు. అయితే ఈ కేసు న్యాయపరమైన పరిణామాలను కూడా ఎదుర్కొంది. హరీశ్‌రావు హైకోర్టును ఆశ్రయించగా అక్కడ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అనంతరం చక్రధర్‌గౌడ్ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించినట్లు అందుబాటులో ఉన్న సమాచారం చెబుతోంది. తాజాగా ఈ కేసును పంజాగుట్ట పోలీస్ స్టేషన్ నుంచి సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అక్కడ పోలీసులు క్రైమ్ నంబర్ 496/2026తో కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.పాత కేసులో పేర్కొన్న సెక్షన్లకు అదనంగా ఆరు సెక్షన్లను చేర్చినట్లు సమాచారం. వాటిలో ఐపీసీ 419, 420, 467, 406 సెక్షన్లతో పాటు ఐటీ యాక్ట్ కింద 66జ, 66డి సెక్షన్లు ఉన్నాయి. ఈ సెక్షన్లు వ్యక్తిగత గుర్తింపును దుర్వినియోగం చేయడం, మోసం, ఫోర్జరీ, నమ్మకద్రోహం, కంప్యూటర్ సంబంధిత గుర్తింపు దుర్వినియోగం, ఆన్‌లైన్ మోసాలకు సంబంధించిన అంశాలను కలిగి ఉంటాయి. కొత్త ఎఫ్ఐఆర్‌లోనూ తన్నీరు హరీశ్‌రావు పేరును ఏ1గా, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు పేరును ఏ2గా పేర్కొన్నట్లు సమాచారం. వీరితో పాటు మరికొందరి పేర్లు కూడా నిందితుల జాబితాలో ఉన్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పుడు సిద్దిపేటకు బదిలీ కావడం, కొత్త క్రైమ్ నంబర్‌తో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, అదనపు సెక్షన్లు చేర్చడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా హరీశ్‌రావు పేరు ఏ1గా ఉండటంతో బీఆర్ఎస్ వర్గాల్లో ఈ పరిణామంపై ఆసక్తి నెలకొంది. ఇక ఈ కేసులో తదుపరి పోలీసుల చర్యలు ఎలా ఉండబోతున్నాయన్నది కీలకంగా మారింది. ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభిస్తాయి, ఎవరెవరిని విచారణకు పిలుస్తారు న్యాయపరంగా ఈ కేసు ఎలాంటి మలుపులు తీసుకుంటుంది అనే అంశాలపై ఉత్కంఠ నెలకొంది.

జనగణనకు ముందే ఓబీసీలపైనిర్ణయం తీసుకోండి

ప్రతిబింబించడం సామాజిక న్యాయానికి కీలకమని ఆమె పేర్కొన్నారు. ఈ రెండు అంశాలపై అసెంబ్లీ, శాసనమండలిలో తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని సూచించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఓబీసీలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రయోజనాలు అందడం లేదని కవిత తన లేఖలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇతర వెనుకబడిన తరగతుల జనాభా ఎంత ఉందన్న అంశంపై కచ్చితమైన, సమగ్ర చట్టబద్ధ గణాంకాలు లేకపోవడం వల్ల విధానాల రూపకల్పనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అభిప్రాయపడ్డారు. జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, ఇతర అవకాశాల్లో న్యాయమైన వాటా కల్పించాలంటే ముందుగా జనాభా వివరాలు స్పష్టంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఓబీసీల ఆందోళనను అన్ని రాజకీయ పార్టీలు పరిగణనలోకి తీసుకుని వారికి మద్దతుగా నిలవాలని కోరారు.ప్రస్తుతం జనగణనలో కుల వివరాలను నమోదు చేసే అంశం ఉన్నప్పటికీ, ఓబీసీలను ప్రత్యేకంగా గుర్తించి వారి జనాభాను నమోదు చేసేందుకు తగిన ఏర్పాట్లు లేవని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ఓబీసీ వర్గాలకు చెందిన ప్రజల జనాభా వివరాలు సమగ్రంగా ప్రతిబింబించకపోవచ్చని పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల జనాభాను ప్రత్యేకంగా నమోదు చేస్తున్నట్లుగానే ఓబీసీల జనాభాను కూడా స్పష్టంగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించి, శాసనమండలిలోనూ చర్చించి తీర్మానం చేయాలని సూచించారు. అనంతరం ఆ తీర్మానాన్ని కేంద్రానికి పంపి, జనగణనలో అవసరమైన మార్పులు తీసుకొచ్చేలా ప్రయత్నించాలని కోరారు. ఆదివాసీల ప్రత్యేక జీవన విధానం, సంప్రదాయాలు, ప్రకృతితో ముడిపడిన ఆచారాలకు జనగణనలో తగిన గుర్తింపు కల్పించాలని కవిత మరో కీలక డిమాండ్ చేశారు. గతంలో నిర్వహించిన జనగణనల్లో ఆదివాసీల మత విశ్వాసాలను ప్రత్యేకంగా నమోదు చేసే అవకాశం ఉండేదని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత జనగణనలో ఆదివాసీల మతాన్ని ప్రత్యేకంగా నమోదు చేసే అవకాశం లేకుండా చేశారనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి, ఆదివాసీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.ం

దేశ మూలవాసులైన ఆదివాసీల జీవన విధానం ప్రత్యేకమైనదని కవిత వివరించారు. ప్రకృతిని, అడవులను తమ ఆరాధనా సంప్రదాయాల్లో భాగంగా భావించడం వారి సంస్కృతిలో అంతర్భాగమని పేర్కొన్నారు. అలాంటి ప్రత్యేక మత విశ్వాసాలు, సాంస్కృతిక గుర్తింపులు జనగణనలో ప్రతిబింబించేలా ప్రత్యేక నమోదు విధానం ఉండాలని అభిప్రాయపడ్డారు. ఆదివాసీల మతాన్ని ప్రత్యేకంగా నమోదు చేయాలని కోరుతూ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశాల్లో తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని ముఖ్యమంత్రిని కోరారు.

రైళ్లు ఆపినా.. కాంగ్రెస్ సైన్యాన్ని ఎవరూ ఆపలేరు

రాష్ట్ర మంత్రులు, సీనియర్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఢిల్లీ పీఠంపై ప్రధాని మోదీ కుర్చీని ఎలాగైనా కాపాడుకోవడానికే పేద ప్రజల ఓట్లను తొలగించే పెద్ద కుట్ర జరుగుతోందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో మరో 20 కోట్ల ఓట్లను తొలగించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కుట్రపూరితంగా ఓట్లను తొలగించి, ఆపై అక్కడి ప్రభుత్వాలను కైవసం చేసుకున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ఇండి కూటమి చేపట్టిన చలో ఢిల్లీ నిరసన ప్రదర్శనలో పాల్గొనేందుకు ఆదివారం వేలాది మంది మద్దతుదారులు మింటో రోడ్డు వద్దకు చేరుకున్నారు. మింటో రోడ్-కన్నాట్ ప్లేస్ కూడలి నుంచి రామ్‌లీలా మైదాన్ వైపుగా ఈ యాత్ర ప్రారంభమైంది. ఎస్ఐఆర్ కింద ముఖ్యంగా అణగారిన, వెనుకబడిన, మైనారిటీ వర్గాలకు చెందిన చట్టబద్ధమైన ఓటర్లను పెద్ద ఎత్తున, ధ్రువీకరించకుండా తొలగిస్తున్నారని ప్రతిపక్ష కూటమి ఆరోపిస్తోంది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది.

మింటో రోడ్‌కు చేరుకోవడానికి ముందు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఎక్స్‌లో ఒక వీడియోను షేర్ చేశారు. కన్నాట్ ప్లేస్‌లో బీజేపీ దుకాణాలను మూసివేసిందని ఆరోపించారు. "మీరు ఇక్కడ మార్చ్, మెగా ర్యాలీకి వచ్చినప్పుడు, వస్తువులు కొనండి, షాపింగ్ చేయండి అని మేము అందరికీ చెప్పాము. కానీ, ఇక్కడ కన్నాట్ ప్లేస్‌కు వచ్చాక, బీజేపీ ప్రతి ఒక్క దుకాణాన్ని బలవంతంగా మూసివేయించిందని మేము కనుగొన్నాము. కాబట్టి, వ్యాపారులకు ఎవరు నష్టం కలిగిస్తున్నారో, అది ఎలా జరుగుతోందో మీరు తెలుసుకోవాలి" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

ముంచుకొస్తున్న 'మురసు' తుపాను

కి.మీ, విశాఖపట్నానికి 770 కి.మీ, మచిలీపట్నానికి 770 కి.మీ, ఒంగోలుకు 810 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని వెల్లడించింది. రాబోయే 6 గంటల్లో ఇది తుపానుగా మారనుండగా, రేపు ఉదయానికి పశ్చిమమధ్య బంగాళాఖాతంలో 'తీవ్ర తుపాను'గా మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ తీవ్ర తుపాను నేడు అర్ధరాత్రి నుంచి ఎల్లుండి తెల్లవారుజాము మధ్య నెల్లూరు - నరసాపురం మధ్య తీరాన్ని దాటవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తుంది. తమిళ భాషలో 'ఢంకా' అనే అర్థం కలిగిన ఈ తుపానుకు 'మురసు' అని పేరు పెట్టారు. ఈ ఏడాది బంగాళాఖాతంలో ఏర్పడిన రెండో తుపాను ఇది. అక్టోబర్ నెలాఖరున అర్నబ్ తుపాను కోస్తాంధ్ర జిల్లాల్లో తీవ్ర నష్టం మిగిల్చింది. ఇంతనే వాతావరణ శాఖ మరో తుపాను హెచ్చరిక చేసింది.

ఏపీ, తెలంగాణలో రానున్న 3 రోజులు భారీ వర్షాలు

మురసు తుపాను తీరం దాటిన అనంతరం తెలంగాణ వైపు ప్రయాణించే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. తుపాను ప్రభావంతో రానున్న 3 రోజులు దక్షిణ కోస్తా రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముంది. తెలంగాణ పరిధిలో ముఖ్యంగా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. మురసు ప్రభావంతో నేటి నుంచి వర్షాలు ప్రారంభమై, మరో రెండ్రోజులు భారీగా కురుస్తాయని ఐఎండీ హైదరాబాద్ ఆదివారం ఉదయం వర్షపాత హెచ్చరిక జారీ చేసింది. ఆదివారం తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. సోమ, మంగళవారాల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి సహా తెలంగాణలోని తూర్పు, దక్షిణ జిల్లాలకు హైదరాబాద్‌లోని ఐఎండీ భారీ వర్ష సూచన చేసింది. రాబోయే కొద్ది రోజుల్లో హైదరాబాద్ రాజధాని ప్రాంతం, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డితో సహా దాని పరిసర జిల్లాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అడపాదడపా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఈదురు గాలులతో కూడిన గాలులు వీస్తాయని పేర్కొంది. తుపాను బలహీనపడి అల్పపీడనంగా మారడంతో, బుధవారం నాటికి వర్షాలు క్రమంగా తగ్గి, స్థానిక ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

అప్రమత్తమైన విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ కోరారు. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, అత్యవసర సహాయక చర్యల కోసం విపత్తు నిర్వహణ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. నేడు పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉందన్నారు. మంగళవారం తెల్లవారుజామున దక్షిణకోస్తా తీరానికి సమీపంలోకి చేరుకుంటుందని, మంగళవారం ఉదయం తీవ్ర తుపానుగా నెల్లూరు-నరసాపురం మధ్య దక్షిణకోస్తా తీరాన్ని దాటే అవకాశం ఉందని తెలిపారు. తుపాను తీరాన్ని దాటే సమయంలో గంటకు 100-110 కి. మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

హారన్ల హోరు..హైదరాబాద్ బేజారు!

మించి శబ్దాలు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో శబ్ద తీవ్రత ఏకంగా 110 డెసిబెల్స్‌కు చేరడం ఆందోళన కలిగిస్తోంది.

నివాస ప్రాంతాల్లోనూ తప్పని శబ్ద మోత

నగరంలోని జూబ్లీహిల్స్, తార్నాక నివాస ప్రాంతాల్లో పర్యవేక్షణ జరిగిన కాలమంతా అనుమతించిన పరిమితులకు మించి శబ్ద కాలుష్యం నమోదైంది. వాణిజ్య ప్రాంతమైన జేఎన్‌టీయూలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. అబిడ్స్‌లో పలు నెలలపాటు రాత్రి వేళల్లోనూ నిర్దేశిత ప్రమాణాలు ఉల్లంఘించినట్లు కాలుష్య నియంత్రణ మండలి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సాధారణంగా ప్రశాంతంగా ఉండాల్సిన నివాస ప్రాంతాలు సైతం వాహనాల హారన్లు, ట్రాఫిక్ శబ్దాలతో సతమతమవుతున్నాయి.

గంటలోనే 110 డెసిబెల్స్!

ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే కూడళ్లలో శబ్ద కాలుష్యం మరింత తీవ్రంగా ఉంటోంది. రోడ్డు భద్రత కార్యకర్త అరుణ్ బతులా వినాయక చవితికి ముందు ట్రాఫిక్ పోలీసులతో కలిసి సచివాలయం సమీపంలోని తెలంగాణ తల్లి కూడలిలో గంటపాటు శబ్ద స్థాయిలను పరిశీలించారు. ఈ సందర్భంగా 82 నుంచి 110 డెసిబెల్స్ వరకు శబ్ద తీవ్రత నమోదైంది. నిరంతరం వినిపించే హారన్లను ఎలా భరిస్తున్నారని అక్కడి సిబ్బందిని ప్రశ్నించగా.. ఆ శబ్దాలకు అలవాటు పడిపోయామని కొందరు చెప్పినట్లు ఆయన వివరించారు. మరికొందరు నిద్రలోనూ హారన్ల శబ్దాలు వినిపిస్తున్నాయని చెప్పడం సమస్య తీవ్రతకు నిదర్శనం.

వాహనాలే ప్రధాన విలన్లు!

నగరంలో శబ్ద కాలుష్యం పెరగడానికి వాహనాల రాకపోకలు, అనవసర హారన్ల మోత ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. రోడ్డు రవాణా కారణంగానే మొత్తం శబ్ద కాలుష్యంలో సుమారు 60 నుంచి 70 శాతం వాటా ఉంటుందని రోడ్డు భద్రత నిపుణుడు లోకేంద్ర సింగ్ వెల్లడించారు. వీటికి తోడు అధిక శబ్దంతో మోగించే డీజేలు, నిర్మాణ పనులు, ఫంక్షన్ హాళ్లలో జరిగే కార్యక్రమాలు సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో నిర్మాణ కార్యకలాపాల కారణంగా శబ్ద స్థాయిలు పెరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

నిశ్శబ్ద జోన్లలోనూ అదే పరిస్థితి

నిశ్శబ్ద ప్రాంతాలుగా ప్రకటించిన చోట్ల సైతం శబ్ద కాలుష్యం అదుపులోకి రావడం లేదు. జూ పార్కులో పగటి వేళల్లో అనుమతించిన శబ్ద పరిమితి 50 డెసిబెల్స్ కాగా.. జనవరిలో 56.6 డెసిబెల్స్‌గా నమోదైన శబ్ద స్థాయి జులై నాటికి 61.5 డెసిబెల్స్‌కు చేరింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిసరాల్లోనూ శబ్ద తీవ్రత సుమారు 70 డెసిబెల్స్‌గా నమోదవుతుండగా.. జులైలో అది 71.3 డెసిబెల్స్‌కు చేరింది. నిశ్శబ్ద ప్రాంతాల్లోనూ నిబంధనలు అమలుకాకపోవడం పర్యవేక్షణ వ్యవస్థల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

అవగాహనతోపాటు కఠిన చర్యలు

అనవసరంగా హారన్లు మోగించకుండా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్ తెలిపారు. హెచ్‌సీఎస్‌సీ వాలంటీర్ల సహకారంతో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అదనపు మల్టీ హారన్లు అమర్చిన వాహనాలపై క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రధాన నగర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు, హారన్లే శబ్ద కాలుష్యానికి ప్రధాన కారణమని, శివారు ప్రాంతాల్లో నిర్మాణ పనుల వల్ల ఈ సమస్య ఎక్కువగా ఉంటోందని వివరించారు.

అకౌస్టిక్ కెమెరాల ప్రయోగం ఏమైంది?

గతంలో అనుమతించిన స్థాయికి మించి శబ్దం చేసే వాహనాలను గుర్తించేందుకు ట్రాఫిక్ పోలీసులు అకౌస్టిక్ కెమెరాల ప్రయోగం చేపట్టినట్లు లోకేంద్ర సింగ్ తెలిపారు. ఈ కెమెరాల ద్వారా వాహనాల శబ్ద తీవ్రతను గుర్తించి, నిబంధనలు ఉల్లంఘించిన వాటికి ఈ-చలానాలు జారీ చేసే అవకాశం ఉండేదని వివరించారు. అయితే ఈ ప్రయత్నం ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదని పేర్కొన్నారు. శబ్ద కాలుష్య నియంత్రణకు కేవలం అవగాహన కార్యక్రమాలే సరిపోవని, ఆధునిక పర్యవేక్షణ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు నిరంతర తనిఖీలు, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. "హారన్ల మోతకు కళ్లెం.. శబ్ద కాలుష్యానికి చెక్ ఎప్పుడు?" అన్న ప్రశ్న ఇప్పుడు నగరవాసులను వేధిస్తోంది.

కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ ..


చందంపేట, (దేవరకొండ) : జిల్లాలోని పీఏ పల్లి మండలం నక్కలపెంట తండాకు చెందిన ఉప సర్పంచ్, వార్డు సభ్యులతోపాటు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని రవీంద్ర కుమార్ గుర్తుచేశారు. పార్టీలో చేరిన వారిలో ఉప సర్పంచ్ అంగోతు మునియా, వార్డు సభ్యులు కేతావత్ హరియా, మేగావత్ కిషన్, కేతావత్ మంగ్తా, ముడావత్ బాలా, మేగావత్ హనుము బావాజీ, మేగావత్ కృష్ణ, కేతావత్ సంతోష్, జాతవత్ రాజా, జాతవత్ నాగేష్, కేతావత్ కుమార్, ఆమ్ గోతు రమేష్, ముడావత్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెల్లుగురి వల్లపు రెడ్డి, సర్పంచులు కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి, రైనబోయిన శ్రీను, ఆడెపు నగేష్, రమావత్ కిషన్, అర్వపల్లి నర్సింహ, తోటకూరి పరమేష్, బొడ్డుపల్లి మహేందర్, రమావత్ శ్రీను, రమావత్ దామోదర్, అనిల్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నందతండా భూములపై ఏ గద్ద కన్ను

- పేదల పట్టాలపై పెద్దల పెత్తనం
- పంచాయతీ ఆస్తులకు రక్షణ కరువు
-29 ఎకరాల లేఅవుట్‌లో అసలు కథేంటి
-471 ప్లాట్ల వెనుక అంతులేని భూవివాదాలు
-1950ల నాటి రిజిస్ట్రేషన్లను పక్కనపెడుతున్నారా.?
-40--50 ఎకరాల భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ ఎప్పుడు.?
-బంధువుల పేర్లతో ఆస్తులంటూ ఫిర్యాదులు.?
-ఫారెస్ట్ శాఖ ఉన్నతాధికారులు స్పందిస్తారా.?
-లీ-సర్వేలో రికార్డుల బండారం బయటపడుతుందా.?



భద్రాద్రి కొత్తగూడెం(ప్రశ్న న్యూస్)ఒకప్పుడు రూపాయి రూపాయి కూడబెట్టి కొనుక్కున్న స్థలం.. నేడు చేతిలో పత్రాలున్నా అనుభవించలేని దుస్థితి పేదల చెమట చుక్కలతో కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలపై హక్కుల పోరాటం. పంచాయతీకి చెందిన ప్రజోపయోగ స్థలాలపై వివాదాలు. తెరపైకి వస్తున్న బినామీ ఆరోపణలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం నందతండాలో భూముల వ్యవహారం ఇప్పుడు స్థానికంగా హాట్‌టాపిక్‌గా మారింది. భూముల విలువ పెరుగుతున్న కొద్దీ పాత వివాదాలు కొత్త రూపం దాల్చుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు హక్కుదారులు ఒకవైపు.. తమకు హక్కులున్నాయంటూ ముందుకొస్తున్న మరికొందరు మరోవైపు.. మధ్యలో ప్రభుత్వ రికార్డులు, పంచాయతీ స్థలాలు గందరగోళంగా మారాయన్నది స్థానికుల ఆవేదన.



భూమి రికార్డులు ఒకచోట.. క్షేత్రస్థాయి పరిస్థితి మరోచోటా..

నందతండాలో కర్రి కోటేశ్వరరావుకు సంబంధించిన 29 ఎకరాల 13 కుంటల భూమిని గతంలో 471 ప్లాట్లుగా విభజించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ లేఅవుట్‌లో రహదారులు, ఖాళీ స్థలాలు, పంచాయతీ అవసరాలకు కేటాయించిన భూముల వివరాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం ఆయా స్థలాల పరిస్థితిపై వివాదాలు నెలకొన్నాయి.
లేఅవుట్‌కు సంబంధించిన అసలు మ్యాప్ ఎక్కడుంది? పంచాయతీకి అప్పగించిన స్థలాల వివరాలు ఏ రికార్డుల్లో ఉన్నాయి? వాటికి సంబంధించిన హద్దులు క్షేత్రస్థాయిలో గుర్తించారా.? ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లాయా.? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

కార్మికుల కన్నీటి సంపాదనకు విలువ లేదా..

1950ల కాలంలో సింగరేణి కార్మికులు, ఇతర కష్టజీవులు తమ జీవితకాల సంపాదనతో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసుకున్నారని బాధితులు చెబుతున్నారు. అప్పటి నుంచి తమ కుటుంబాల హక్కుగా భావిస్తున్న స్థలాలపై ఇప్పుడు వివాదాలు తలెత్తడం వారిని కలవరపెడుతోంది.పాత రిజిస్ట్రేషన్ పత్రాలు, కొనుగోలు ఒప్పందాలు, వారసత్వ హక్కుల ఆధారంగా స్థలాలను గుర్తించాలని బాధితులు కోరుతున్నారు. కొత్తగా తెరపైకి వస్తున్న డాక్యుమెంట్ల అసలు స్వరూపాన్ని పరిశీలించకుండా నిర్ణయాలు తీసుకుంటే అసలు యజమానులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగ హోదా అడ్డుగా.. బినామీ వ్యవహారాలా..

ఈ భూవివాదాల్లో ఓ ఫారెస్ట్ అధికారి, ఆయన సోదరుడు, ఇతర బంధువుల పేర్లు వినిపిస్తున్నాయి. వారి పేర్లతో భూములు కొనుగోలు చేశారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. చుంచుపల్లి మండల పరిధిలో 40 నుంచి 50 ఎకరాలకు పైగా భూముల వ్యవహారంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ ఉద్యోగుల ఆస్తుల వివరాలు నిబంధనల ప్రకారం పరిశీలించాల్సిన అవసరం ఉందని బాధితులు అంటున్నారు. సంబంధిత అధికారి ఆస్తులు, ఆదాయ వనరులు, కుటుంబ సభ్యుల పేర్లపై జరిగిన లావాదేవీలను ఉన్నతాధికారులు పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని కోరుతున్నారు.
అయితే ఈ ఆరోపణలు ఇంకా అధికారికంగా నిర్ధారణ కాలేదు. సంబంధిత అధికారి వివరణ, భూముల రిజిస్ట్రేషన్ వివరాలు, ఆదాయ వనరుల పరిశీలనతోనే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుంది.

పంచాయతీ ఆస్తులపై పర్యవేక్షణ ఎక్కడ..

గ్రామపంచాయతీకి చెందిన ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులపై ఉంటుంది. అయినప్పటికీ ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాలపై వివాదాలు వస్తున్నాయంటే పర్యవేక్షణలో లోపాలున్నాయా.? పంచాయతీ ఆస్తుల రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేశారా.? స్థలాలను గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారా.? ఆక్రమణలపై గతంలో ఫిర్యాదులు అందాయా.? అందితే చర్యలు ఎందుకు తీసుకోలేదు.?గ్రామసభలో ఈ అంశాన్ని చర్చించి ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

బెదిరింపుల వెనుక బలం ఎవరిది..

తమ స్థలాలను పరిశీలించేందుకు వెళ్లినప్పుడు కొందరు వ్యక్తులు అడ్డుకుంటున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. కులం పేరుతో ఒత్తిళ్లు తెస్తున్నారన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఎవరి ప్రమేయం ఉన్నా పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు రక్షణ కల్పించాలి. భూమి వివాదాలను బలప్రయోగంతో పరిష్కరించే ప్రయత్నాలను అడ్డుకోవాలి.

రెవెన్యూ రీ-సర్వేనే కీలకం..

నందతండాలో నెలకొన్న వివాదాలకు పరిష్కారం చూపాలంటే క్షేత్రస్థాయి రీ-సర్వే అత్యంత కీలకం. పాత సర్వే నంబర్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, లేఅవుట్ అనుమతులు, పంచాయతీ రికార్డులు, ప్రస్తుత భూ ఆక్రమణల వివరాలను ఒకదానితో మరొకటి సరిపోల్చాలి.
29 ఎకరాల 13 కుంటల భూమికి సంబంధించిన అసలు రికార్డుల పరిశీలన.
471 ప్లాట్ల ప్రస్తుత యాజమాన్య వివరాల ధ్రువీకరణ.
పంచాయతీకి కేటాయించిన స్థలాల గుర్తింపు.
1950ల నాటి రిజిస్ట్రేషన్ పత్రాల పరిశీలన.
40--50 ఎకరాలపై వచ్చిన ఆరోపణలపై విచారణ.
వివాదాస్పద రిజిస్ట్రేషన్లు, డాక్యుమెంట్ల చట్టబద్ధత పరిశీలన.
బాధితుల ఫిర్యాదులపై పోలీసు విచారణ.
ఈ అంశాలన్నింటిపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని స్థానికులు



డిమాండ్ చేస్తున్నారు

.ఏసీబీ, విజిలెన్స్ విచారణకు డిమాండ్..

ఫారెస్ట్ అధికారి ఆస్తులపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ, విజిలెన్స్ శాఖలు చట్టపరమైన పరిధిలో విచారణ చేపట్టాలని బాధితులు కోరుతున్నారు. అక్రమాస్తులు ఉన్నట్లు ఆధారాలు లభిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఫారెస్ట్ శాఖలు సమన్వయంతో వ్యవహరించి భూముల అసలు పరిస్థితిని వెల్లడించాలని కోరుతున్నారు.

కలెక్టర్ జోక్యం చేసుకుంటారా.?

జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి నందతండాలోని భూవివాదాలపై సమగ్ర విచారణకు ఆదేశించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. బాధితులకు ప్రత్యేక విచారణ వేదిక కల్పించి వారి వద్ద ఉన్న పాత పత్రాలను స్వీకరించాలి. పంచాయతీ ఆస్తుల వివరాలను బహిరంగపరచాలి. ఆక్రమణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అసలు హక్కుదారులకు న్యాయం జరిగేలా చూడాలి.

వరుసకు బాబాయ్..!

పెళ్లి చేసుకోవాలని బాలికపై ఒత్తిడి, రాప్తాడు ఘటనలో కీలక విషయాలు

ఏపీలోని అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినిపై అత్యంత కిరాతకంగా దాడి చేసిన ఘటనలో కీలక విషయాలు వెలుగులోకొచ్చాయి. దాడి చేసిన హేమంత్ బాలికకు వరుసకు బాబాయ్ అవుతాడని తెలిసింది. హేమంత్ ఆమెను పెళ్లి చేసుకుంటానని మొండిపట్టడంతో కుటుంబ సభ్యులు మందలించారని సమాచారం. అలాగే నిందితుడు గంజాయి, మద్యానికి బానిసగా మారి, గతంలోనూ గర్ల్స్ హాస్టల్‌లో యువతులపై దాడికి పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. కాగా, రాప్తాడులోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన దాడి తీవ్ర కలకలం రేపుతోంది. తరగతి గదిలోకి చొరబడిన హేమంత్ పవర్ చైన్‌సాతో బాలికపై దాడి చేయడంతో ఆమె ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది. తీవ్రంగా గాయపడిన బాలికను తొలుత అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి బెంగళూరుకు తీసుకెళ్లారు.

పులివెందులలో కార్లు, బైక్‌లకు నిప్పు పెట్టిన దుండగులు..

– పలు వాహనాలు ధ్వంసం



వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో దుండగులు పలు వాహనాలకు నిప్పు పెట్టడంతో స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్‌కు ముందు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పట్టణంలోని శిల్పారామం సమీపంలోని ఉల్లిమలకు చెందిన మధుసూదన్‌రెడ్డికి చెందిన తోట వద్ద శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు పెట్రోల్ పోసి పెద్ద ఎత్తున వాహనాలకు నిప్పంటించారు. ఇందులో 3 కార్లు, 10 బైక్‌లు, ట్రాక్టర్‌కు నిప్పు పెట్టడంతో మంటల్లో వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఘటన. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కండ్లలో పెప్పర్ స్ప్రే కొట్టి , కాళ్లు చేతులు కట్టేసి శివసత్తు దారుణ హత్య



యాదాద్రి భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని మార్కండేయ కాలనీలో సుధాకర్ స్వామి గురూజీ అనే శివసత్తు దారుణ హత్యకు గురయ్యాడు. నిందితులు కండ్లలో పెప్పర్ స్ప్రే కొట్టి , కాళ్లు చేతులు కట్టేసి దారుణంగా హత్య చేశారు. అనంతరం బీరువాలో ఉన్న సుమారు 70 తులాల బంగారం, కొంత నగదును అపహరించి, మృతుని స్కార్పియో వాహనంలో పరారయ్యారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. నిందితులు అసోంకు చెందివారుగా గుర్తించారు. గత కొంతకాలంగా స్వామీజీ వద్ద శిష్యులుగా తిరుగుతున్నారని వారి బంధువులు తెలిపారు. స్కార్పియో వాహనం జిపిఎస్ ఆధారంగా బోధన్ పరిధిలో ఇద్దరు నిందితులను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గద్వాలలో కారు బీభత్సం..

ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం



గద్వాల : జోగులాంబ గద్వాల పట్టణంలో ఓ కారు బీభత్సం సృష్టించింది. అంబేద్కర్ చౌక్ వద్ద కొబ్బరి కాయల బొండాల లోడుతో వెళ్తున్న వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో జిల్లాలోని మల్దకల్ మండలం పాల్వాయి గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను గద్వాల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎల్‌ఆర్‌ఎస్ అధికారి కనిపించడం లేదు..

బడంగ్‌పేట్,: బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్ కావడానికి ఎల్‌ఆర్‌ఎస్ ప్రత్యేక అధికారి మహమ్మద్ యాసిన్ కారణం అంటూ పోస్టర్లు వెలిశాయి. ఆయన కనబడటం లేదని బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో డోర్లకు స్టిక్కర్లు వెలిశాయి. ఇవి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు క్లియర్ చేయాలంటే ఫైల్స్‌కు రూ.20వేలు అడుగుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. అయితే సదురు అధికారిపై ఇప్పటికే బడంగ్‌పేట్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మరోసారి ఆయనపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు డీసీ తెలిపారు. మహమ్మద్ యాసిన్ బైక్‌పై దాదాపుగా 24 కేసులు ఉన్న వివరాలను సోషల్ మీడియాలో పెట్టి వైరల్ చేస్తున్నారు. ఆయన పై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది : డీఈవో రమేశ్

మద్దూరు (ధూళిమిట్ట): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్ అన్నారు. ధూళిమిట్ట హైస్కూల్లో గెజిటెడ్ హెచ్ఎం, ఎంఈవో అనుముల కరుణాకర్ రెడ్డి ఉద్యోగ విరమణకు డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి అవసరమైన మానవ వనరులను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఉత్తమ సేవలు అందించడం ద్వారానే ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా గెజిటెడ్ హెచ్ఎంగా, ఎంఈవో కరుణాకర్ రెడ్డి అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ప్రధానంగా ధూళిమిట్ట హైస్కూల్ అభివృద్ధి కోసం చూపిన చొరవ అభినందనీయమన్నారు.

అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం చిలుక వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన సన్మాన సభలో రిటైర్డు డీఈవో శ్రీనివాస్ రెడ్డి , సర్పంచ్ గునుకుల లీలాజగన్మోహన్ రెడ్డి , మద్దూరు ఎంఈవో వరదరాజు, విశ్రాంత ఉపాధ్యాయులు తిగుళ్ల సుధాకరశర్మ, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

హాల్‌టికెట్లు ఇచ్చి.. ఫీజులు వసూలు చేసి..

తీరా పరీక్ష రద్దుపై తల్లిదండ్రుల ఆందోళన

రామగిరి : విద్యార్థుల భవిష్యత్తుతో పాఠశాల యాజమాన్యాలు ఆటలాడుతున్నాయి. పరీక్ష నిర్వహిస్తామని ముందుగానే ఫీజులు వసూలు చేసి, హాల్‌టికెట్లు జారీ చేసి, తీరా పరీక్ష కేంద్రానికి వచ్చిన తర్వాత పరీక్ష రద్దు చేయడం పట్ల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో స్కోర్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించి విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసి, హాల్‌టికెట్లు కూడా జారీ చేశారు.

పరీక్షకు సిద్ధమై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. అయితే పరీక్ష నిర్వహణకు అవసరమైన ఎలాంటి ఏర్పాట్లు కనిపించకపోవడంతో పాటు, పరీక్ష రద్దయిందని పాఠశాల సిబ్బంది చెప్పడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఒక్కసారిగా అయోమయానికి గురయ్యారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా, పరీక్ష కేంద్రానికి వచ్చిన తర్వాత రద్దు విషయాన్ని తెలియజేయడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి తరలివచ్చిన తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగినా, ప్రిన్సిపాల్ గానీ, యాజమాన్య ప్రతినిధులు గానీ సరైన వివరణ ఇవ్వకపోవడం మరింత ఆవేదనకు గురిచేసింది.

విద్యార్థులకు విద్యాబోధనతో పాటు బాధ్యతాయుతమైన సేవలు అందించాల్సిన విద్యాసంస్థలు ఇలాంటి వ్యవహారాల్లో పారదర్శకత పాటించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. పరీక్ష రద్దుకు గల కారణాలను యాజమాన్యం వెంటనే వెల్లడించి, విద్యార్థులకు న్యాయం చేయాలని, ఇలాంటి కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పులివెందుల పుర పోరులో విధ్వంసం..

– ఓటర్లు రాకుండా రాళ్ల దాడి



పులివెందుల ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఎన్నికల్లో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. ఆదివారం ప్రారంభమైన పుర పోరు పోలింగ్‌లో కడప జిల్లా పులివెందులలో టీడీపీ గూండాలు విధ్వంసం సృష్టిస్తున్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయకుండా పచ్చమూకలు ఓటర్లను అడ్డుకుంటున్నాయి. అధికార బలం అండ చూసుకొని పచ్చ పార్టీ శ్రేణులు రెచ్చిపోతున్నారు. చివరకు టీడీపీ అరాచకాలను కవర్ చేస్తున్న జాతీయ మీడియాపై కూడా ఆ పార్టీ రౌడీలు దాడి చేశారు. జాతీయ మీడియా కెమెరాను ధ్వంసం చేశారు. అలాగే పులివెందుల 11, 12 బూత్‌ల దగ్గర తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై టీడీపీ గూండాలు రాళ్లు విసురుతున్నారు. బూత్‌లకు ఎవరూ రాకుండా పచ్చమూకలు అడ్డుకుంటున్నారు. ఇంతటితో ఆగకుండా పోలింగ్ బూత్‌లను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టీడీపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, టీడీపీ గూండాలకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని వైసీపీ నేతలు ఆరోపించారు. ఓటు వేయకుండా పోలీసులు అడ్డుకోవడంతో పులివెందుల బాయ్స్ జూనియర్ కాలేజీ వద్ద ఓటర్లు నిరసనకు దిగారు. పోలింగ్ బూత్ వద్ద 400 మంది ఓటర్లు బైఠాయించారు. తమ ఓట్లు టీడీపీ నేతలే వేస్తున్నారని స్థానిక ఓటర్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. ఓటర్లపై డీఎస్పీ మురళీ నాయక్ బెదిరింపులకు దిగారు. వెళ్లిపోండి.. ఓట్లు వేయొద్దు అంటూ బెదిరించిన డీఎస్పీ.. మీకు ఓటు వేసే హక్కు లేదంటూ ఓటర్లకు డీఎస్పీ వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ఓటర్లకు రక్షణ కల్పించకుండా పోలీసులు వెనక్కి పంపతుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు విజయవాడలో గరపాలక సంస్థ 55వ డివిజన్ ఎన్నికల బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల గుర్తులు తారుమారయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి షేక్ హసన్ బాషా పేరు పక్కన హస్తం గుర్తు ముద్రించగా.. కాంగ్రెస్ అభ్యర్థి షరీఫ్ షేక్ పేరు ఎదుట ఫ్యాన్ గుర్తు ముద్రించారు. బ్యాలెట్ పేపరలో గుర్తులు మారడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ వైసీపీ అభ్యర్థి ఎన్నికల రిటర్నింగ్ అధికారి చక్రవర్తికి ఫిర్యాదు చేశారు. దీంతో సదురు డివిజన్‌లో పోలింగ్ నిలిపి వేశారు. కొత్తగా బ్యాలెట్ పేపర్స్ ప్రింట్ చేసిన తర్వాత పోలింగ్ జరగనున్నట్లు సమాచారం.

టీటీడీ పీఠంపై ఉత్కంఠ..

ఇద్దరిలో ఒకరికి పట్టం

నేటితో ముగిసిన పాలకమండలి రెండేళ్ల ప్రస్థానం

కొత్త చైర్మన్ ఎంపికపై కూటమి ప్రభుత్వ కసరత్తు

చంద్రబాబు నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి



తిరుమల(ప్రశ్న న్యూస్) కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి పగ్గాలు ఎవరి చేతికి వెళ్లనున్నాయి? రెండేళ్ల పాటు చైర్మన్‌గా వ్యవహరించిన బీఆర్ నాయుడు స్థానంలో కొత్తగా ఎవరికి అవకాశం దక్కనుంది? రాజకీయ, ఆధ్యాత్మిక వర్గాల్లో ఇప్పుడు ఇదే హాట్‌టాపిక్‌గా మారింది. టీటీడీ ప్రస్తుత పాలకమండలి రెండేళ్ల పదవీకాలం అక్టోబరు 31తో ముగియడంతో తదుపరి పరిణామాలపై ఉత్కంఠ నెలకొంది. కొత్త చైర్మన్ నియామకంపై కూటమి ప్రభుత్వంలో కసరత్తు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అమల్లో ఉన్న ఎన్నికల కోడ్ కొత్త పాలకమండలి ఏర్పాటుకు అడ్డంకిగా మారే అవకాశముంది. దీంతో తాత్కాలికంగా స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేసి దేవస్థానం పాలనా వ్యవహారాలను కొనసాగించాలనే ఆలోచన ఉన్నట్లు సమాచారం.

రేసులో రెండు పేర్లు..

కొత్త టీటీడీ చైర్మన్ ఎంపికపై ఇప్పటికే పలువురి పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ ప్రధానంగా రెండు పేర్ల చుట్టూ చర్చ సాగుతోంది. ఎన్ఆర్ఐ పారిశ్రామికవేత్త, ఆధ్యాత్మిక నేపథ్యం ఉన్న శ్రీనివాస రామానుజం, టీడీపీ సీనియర్ నాయకుడు కళా వెంకట్రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిలో ఎవరికి అవకాశం దక్కుతుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. పార్టీకి చేసిన సేవలు, సామాజిక సమీకరణాలు, ఆధ్యాత్మిక సంస్థ నిర్వహణపై అవగాహన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అధిష్ఠానం నిర్ణయం తీసుకునే అవకాశముందని చర్చ జరుగుతోంది. అయితే ఈ పేర్లపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

చంద్రబాబు నిర్ణయమే కీలకం..

టీటీడీ చైర్మన్ పదవి కేవలం ఒక నామినేటెడ్ పోస్టు మాత్రమే కాదు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసాలతో ముడిపడిన అత్యంత ప్రతిష్ఠాత్మక బాధ్యత. తిరుమల పవిత్రతను కాపాడటం, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, పరిపాలనలో పారదర్శకత తీసుకురావడం కొత్త చైర్మన్ ముందున్న ప్రధాన సవాళ్లు. అదే సమయంలో కూటమిలోని భాగస్వామ్య పక్షాలు, పార్టీ సీనియర్లు, ప్రాంతీయ సమీకరణాలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. స్థానిక ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతే కొత్త పాలకమండలి కూర్పుపై స్పష్టత వచ్చే అవకాశముందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ఏపీలో ప్రశాంతంగా మున్సిపల్ పోలింగ్..

పట్టణాల్లో జోరు, నగరాల్లో నీరసం

ఏపీలో 92 పురపాలక, నగరపాలక సంస్థలకు జరుగుతున్న ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 11 గంటల సమయానికి 22.08 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. కొన్ని చిన్న పట్టణాల్లో ఓటర్లు భారీగా తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుంటుండగా, ప్రధాన నగరాల్లో పోలింగ్ మందకొడిగా సాగుతోంది.రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో జరుగుతున్న ఈ ఎన్నికల్లో దాదాపు 99.36 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మేయర్లు, చైర్‌పర్సన్లు, వార్డు సభ్యుల భవితవ్యాన్ని ఓటర్లు తమ తీర్పు ద్వారా నిర్ణయించనున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్, ఎలాంటి అవాంతరాలు లేకుండా సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది.ముఖ్యంగా చిన్న పట్టణాల్లో ఓటింగ్ శాతం ఆశాజనకంగా ఉంది.

వైఎస్ఆర్ కడప జిల్లాలోని జమ్మలమడుగులో ఉదయం 11 గంటలకే ఏకంగా 60.92 శాతం పోలింగ్ నమోదై అందరి దృష్టిని ఆకర్షించింది. అదేవిధంగా కుప్పంలో 44.30 శాతం, కనిగిరిలో 43.06 శాతం చొప్పున ఓటింగ్ నమోదైంది. పులివెందులలో 34 శాతం, రాయదుర్గ్‌లో 38.79 శాతం, కాకినాడ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సగటున 32 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఉదయం నుంచే బారులు తీరారు.అయితే, దీనికి భిన్నంగా ప్రధాన నగరాల్లో ఓటింగ్ సరళి నెమ్మదిగా ఉంది. గుంటూరు కార్పొరేషన్‌లో 11 గంటల వరకు కేవలం 17.82 శాతం పోలింగ్ నమోదు కాగా, అనంతపురం నగరంలో 16.30 శాతంతో ఇంకా తక్కువగా నమోదైంది. నగర ప్రాంతాల్లో ఓటర్లు మధ్యాహ్నం తర్వాత పోలింగ్ కేంద్రాలకు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని, ఓట్ల లెక్కింపు ప్రక్రియను మంగళవారం చేపట్టనున్నామని అధికారులు తెలిపారు.

టీడీపీపై నెట్టేందుకే దాడులు..

- పులివెందుల అరాచకం వెనుక జగన్ డైరెక్షన్: ఎమ్మెల్సీ వర్ల రామయ్య

పులివెందులలో జరుగుతున్న అల్లర్లు, అరాచకాలకు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని, ఆయన దర్శకత్వంలోనే ఈ కుట్రలు జరుగుతున్నాయని టీడీపీ ఎమ్మెల్సీ వర్ల రామయ్య తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటమి భయంతో వైసీపీ కార్యకర్తలే తమ వాహనాలకు తామే నిప్పు పెట్టుకుని, ఆ నిందను టీడీపీ, కూటమిపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. పులివెందులలో దశాబ్దాలుగా కొనసాగుతున్న వైఎస్ కుటుంబ ఆధిపత్యానికి ఈ ఎన్నికలతో చరమగీతం పాడబోతున్నారని అన్నారు.

ఈ సందర్భంగా వర్ల రామయ్య మాట్లాడుతూ.. “కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పులివెందులలో కూడా స్వేచ్ఛాయుత, ప్రశాంతమైన ఎన్నికలు జరగాలని సంకల్పించారు. దీంతో ప్రభుత్వ యంత్రాంగం, రాష్ట్ర ఎన్నికల సంఘం పటిష్ఠంగా పనిచేస్తున్నాయి. దొంగ ఓట్లు, రిగ్గింగ్, దొడ్డిదారులు ఇక నడవవని స్పష్టం కావడంతో జగన్మోహన్ రెడ్డిలో ఆందోళన మొదలైంది. నదిలో కొట్టుకుపోతున్న వ్యక్తి గడ్డిపోచను పట్టుకున్నట్టు, కనీసం తన పిన్ని ప్రమిళ రెడ్డిని గెలిపించుకోవాలనే ఉద్దేశంతో ఈ అరాచకానికి తెరలేపారు” అని అన్నారు. పోలింగ్ రోజున ‘చేతులు మడతపెడతాను’ అని జగన్ చేసిన వ్యాఖ్యలు రౌడీలకు, అసాంఘిక శక్తులకు ధైర్యం ఇచ్చేందుకేనని వర్ల రామయ్య ఆరోపించారు. “బయటి నుంచి ఓటర్లను ట్రాక్టర్లు, కార్లలో తీసుకొచ్చి తోటల్లో దాచిపెట్టారు. కానీ పోలీసులు నిఘా పెంచడంతో వారి దొంగ ఓట్ల ప్రణాళిక విఫలమైంది. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో, సానుభూతి కోసం తమ వాహనాలకే నిప్పు పెట్టుకుని నాటకాలాడుతున్నారు. గతంలో ఎన్నో అరాచకాలు జరిగినప్పుడు పిలవని జాతీయ మీడియాను ఇప్పుడు ఎందుకు పిలిపించారు?” అని ప్రశ్నించారు.

జగన్‌కు హెలికాప్టర్‌కు అనుమతి రాలేదన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. అనుమతి వచ్చినప్పటికీ, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా భారీ కాన్వాయ్‌తో రావడం చట్ట ఉల్లంఘనేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా నిబంధనలను పాటిస్తారని గుర్తుచేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, పోలీసులు ఎవరికీ భయపడకుండా, కేవలం చట్టానికి మాత్రమే లోబడి పనిచేయాలని సూచించారు. ఈసారి పులివెందుల ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని, ఈ వాతావరణాన్ని చెడగొట్టడానికే జగన్ ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని వర్ల రామయ్య ఆరోపించారు.

తుఫాను బీభత్సం.. రైతన్న బతుకు ఛిద్రం

చేతికొచ్చిన పంట గాలిపాలు.. పెట్టుబడి నేలపాలు

కాకినాడలో 55 వేల హెక్టార్లకు తీరని నష్టం

కోతకు సిద్ధమైన అరటి తోటలపై ప్రకృతి పంజా





కాకినాడ(ప్రశ్న న్యూస్) పంట చేతికొచ్చే వేళ ప్రకృతి కన్నెర్ర చేసింది. రెక్కల కష్టంతో పెంచిన పంటను పెనుగాలులు నేలమట్టం చేశాయి. అప్పులు చేసి సాగు చేసిన రైతుకు దిగుబడి రాకముందే నష్టం మిగిలింది. ఆర్నబ్ తుఫాను కాకినాడ జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య రంగాలను అతలాకుతలం చేసింది. వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. కోతకు సిద్ధమైన అరటి తోటలు నేలకొరిగాయి. మరోవైపు మత్స్యకారుల బోట్లు, వలలు ధ్వంసమయ్యాయి. విద్యుత్, రహదారుల వ్యవస్థ దెబ్బతింది. ఈ విధ్వంసంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. కేంద్ర అంతర్ మంత్రిత్వ శాఖల బృందం జిల్లాలో పర్యటించి నష్టాలను స్వయంగా పరిశీలించింది. రైతుల కన్నీటి గాథలను ఆలకించింది. క్షేత్రస్థాయిలో గుర్తించిన నష్టాల ఆధారంగా కేంద్రానికి నివేదిక సమర్పించనుంది.

గాలుల దెబ్బకు పంటల విలవిల..

గంటకు 120 నుంచి 140 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురు గాలులు జిల్లాలో పంటలను తీవ్రంగా దెబ్బతీశాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు 55 వేల హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లింది. ఒక్క వరి పంటనే 53,878 హెక్టార్లలో కోల్పోయినట్లు అధికారులు గుర్తించారు. మొత్తం 86,897 మంది రైతులు తుఫాను ప్రభావానికి గురయ్యారు. పంట నష్టంతో పాటు మత్స్యకారుల జీవనోపాధి, విద్యుత్ సరఫరా, రహదారుల వ్యవస్థపైనా ప్రకృతి విపత్తు తీవ్ర ప్రభావం చూపింది.

అరటి రైతు ఆశలపై తుఫాను పంజా...

పిఠాపురం మండలం వీరవాడలో అరటి రైతు పరిస్థితి హృదయవిదారకంగా మారింది. 3.50 ఎకరాల్లో కర్పూరం, చెక్కకేళి రకాల అరటి సాగు చేపట్టగా.. తుఫాను వచ్చే సమయానికి పంట 9 నుంచి 11 నెలల వయసుకు చేరుకుంది. కోతకు సిద్ధమైన దశలో బలమైన గాలులు మొక్కలను నేలకొరిగించాయి. ఎకరాకు సుమారు 500 గెలల దిగుబడి వస్తుందని, ఒక్కో గెలకు రూ.250 నుంచి రూ.300 ధర లభిస్తుందని రైతు ఆశించాడు. నవంబర్, డిసెంబర్‌లో కార్తీక మాసం సందర్భంగా మంచి ధర వస్తుందని ఎదురుచూశాడు. కానీ తుఫాను దెబ్బకు 50 శాతానికి పైగా పంట దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు.

పరిహారం ఎంత.. నష్టం ఎంత..

అరటి సాగు కోసం రైతు ఇప్పటికే సుమారు రూ.1.20 లక్షలు పెట్టుబడి పెట్టాడు. మొక్కలు, ఎరువులు, కూలీల ఖర్చులు, ఇతర సాగు పనుల కోసం చేసిన వ్యయం తుఫాను కారణంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు మళ్లీ మొక్కలు నాటాలి.. ఆధారాలు ఏర్పాటు చేయాలి.. ఎరువులు కొనాలి.. కూలీలను పెట్టాలి. తిరిగి సాగు ప్రారంభించాలంటే అదనపు పెట్టుబడి అవసరం. అర్హులైన రైతులకు హెక్టారుకు రూ.35 వేల చొప్పున పంట నష్టపరిహారం అందించనున్నట్లు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ వెల్లడించారు. అయితే రైతు పెట్టుబడి, ఆశించిన ఆదాయం, వాస్తవ నష్టం మధ్య పరిహారం ఎంతమేర ఉపశమనం కలిగిస్తుందన్నదే ప్రశ్న.

మత్స్యకారుల ఉపాధికి గండి..

తుఫాను బీభత్సం సముద్ర తీర ప్రాంతాల్లోనూ తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. జిల్లాలో 579 మత్స్యకార బోట్లు, 1,044 వలలు దెబ్బతిన్నాయి. చేపల వేటే జీవనాధారంగా బతికే కుటుంబాలకు ఇది పెద్ద ఎదురుదెబ్బ. మరోవైపు 1,588 విద్యుత్ స్తంభాలు, 222 ట్రాన్స్‌ఫార్మర్లు, 214 కిలోమీటర్ల విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. 88.9 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రహదారులు దెబ్బతినగా.. ఉప్పాడ వద్ద సముద్రపు అలల ఉధృతికి రహదారి, వంతెన తీవ్రంగా దెబ్బతిన్నాయి. 879 చెట్లు నేలకొరిగాయి.

ముందస్తు చర్యలతో ప్రాణనష్టం నివారణ...

తుఫాను హెచ్చరికలు అందిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. 54 ప్రమాదకర తీర గ్రామాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టింది. అక్టోబర్ 25 నుంచే మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా నిషేధం విధించింది. ఎన్‌డీఆర్ఎఫ్ ఒక బృందం, ఎస్‌డీఆర్ఎఫ్ మూడు బృందాలను రంగంలోకి దించింది. 11,847 మందిని 63 పునరావాస కేంద్రాలకు తరలించింది. బాధితులకు 77 వేల ఆహార పొట్లాలు, లక్షకు పైగా మంచినీటి ప్యాకెట్లు అందించింది. ముందస్తు హెచ్చరికలు, శాఖల సమన్వయంతో పెద్ద ఎత్తున ప్రాణనష్టాన్ని నివారించగలిగామని అధికారులు వివరించారు.

కేంద్ర బృందం క్షేత్రస్థాయి బాట...

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని బృందం కాకినాడ కలెక్టరేట్‌లో నష్టం వివరాలను పరిశీలించింది. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తుఫానుకు ముందు తీసుకున్న చర్యలు, నష్టాల అంచనాలు, సహాయక కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం పిఠాపురం మండలం వీరవాడలో దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించిన కేంద్ర బృందం రైతులతో నేరుగా మాట్లాడింది. పెట్టుబడి, దిగుబడి, మార్కెట్ ధరలు, ఆర్థిక నష్టాల వివరాలు సేకరించింది. విపత్తు నిర్వహణలో ఆర్‌టీజీఎస్ ద్వారా అమలవుతున్న సాంకేతిక పర్యవేక్షణ, సమన్వయ విధానాలను తమ నివేదికలో ప్రత్యేకంగా ప్రస్తావిస్తామని కేంద్ర బృందం తెలిపింది.

మరో తుఫాను గండం.. కోస్తాకు కంటిమీద కునుకు కరువు

- నవంబర్ 3న బాపట్ల సమీపంలో తీరం దాటే అవకాశం

- గంటకు 110 కి.మీ. వేగంతో ప్రచండ గాలులు

- 20 మండలాలకు అత్యంత భారీ వర్ష సూచన

- బుడమేరుకు 32,500 క్యూసెక్కుల వరద ప్రవాహం అంచన

- 12 జిల్లాల్లో 15 వేలకుపైగా విద్యుత్ స్తంభాలకు

ముప్పు ఢిల్లీ పర్యటన రద్దు చేసుకున్న సీఎం చంద్రబాబు

- ప్రతి నాలుగు గంటలకు తుఫాను బులెటిన్ విడుదలకు ఆదేశం



అమరావతి(ప్రశ్న న్యూస్) రాష్ట్రాన్ని మరో తుఫాను భయం వెంటాడుతోంది. ఇటీవలే అర్నబ్ తుఫాను సృష్టించిన బీభత్సం నుంచి పూర్తిగా కోలుకోకముందే మరో ప్రకృతి విపత్తు ముంచుకొస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం క్రమంగా బలపడి తీవ్ర వాయుగుండంగా, అనంతరం తుఫానుగా మారే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. నవంబరు 3వ తేదీ ఉదయం బాపట్ల సమీపంలో తీవ్ర తుఫానుగా తీరం దాటే అవకాశం ఉందన్న అంచనాలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు.తుఫాను ముప్పును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. వర్షాలు, గాలుల తీవ్రత, వరద ప్రవాహాలు, జలాశయాల పరిస్థితి, విద్యుత్, టెలికాం వ్యవస్థల సంసిద్ధతపై సమగ్రంగా చర్చించారు. విపత్తు ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. పరిస్థితి తీవ్రతను పరిగణనలోకి తీసుకుని సోమవారం జరగాల్సిన తన ఢిల్లీ పర్యటనను కూడా రద్దు చేసుకున్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

మూడు రోజుల పాటు వర్ష బీభత్సం..

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం నవంబరు 2 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నవంబరు 3 ఉదయం బాపట్ల సమీపంలో తీరం దాటొచ్చని అంచనా వేశారు. దీని ప్రభావంతో దక్షిణ, మధ్య కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది.నవంబరు 2న దక్షిణ, మధ్య కోస్తాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు, అక్కడక్కడ అతి భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. నవంబరు 3, 4 తేదీల్లో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని హెచ్చరించింది.ముఖ్యంగా 20 మండలాలను అత్యంత భారీ వర్షాల ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. ఏలూరు జిల్లాలో 9, కృష్ణా జిల్లాలో 5, ఎన్టీఆర్ జిల్లాలో 5, బాపట్ల జిల్లాలో ఒక మండలానికి ముప్పు పొంచి ఉందని అధికారులు తెలిపారు. జిల్లాల వారీగా వర్షపాతం అంచనాలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి.

ఏలూరులో 179 మి.మీ. వర్షం..

నవంబరు 3న జిల్లాల వారీగా నమోదయ్యే అవకాశం ఉన్న సగటు వర్షపాతంపై అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు అందించారు.

ఏలూరు జిల్లా – 179 మిల్లీమీటర్లు
కృష్ణా జిల్లా – 163 మిల్లీమీటర్లు
ఎన్టీఆర్ జిల్లా – 161 మిల్లీమీటర్లు
పశ్చిమ గోదావరి – 147 మిల్లీమీటర్లు
గుంటూరు జిల్లా – 119 మిల్లీమీటర్లు
బాపట్ల జిల్లా – 104 మిల్లీమీటర్లు

ఈ స్థాయిలో వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే అవకాశం ఉంది. పట్టణాలు, గ్రామాల్లో ముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. వర్షపు నీరు నిలిచిపోయే ప్రాంతాలను ముందుగానే గుర్తించి మోటార్లు, పంపుసెట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

బుడమేరుకు మళ్లీ వరద గండం..

తుఫాను హెచ్చరికలతో బుడమేరు పరివాహక ప్రాంతాల్లో మరోసారి ఆందోళన నెలకొంది. భారీ వర్షాల నేపథ్యంలో నవంబరు 3న బుడమేరు వద్ద సుమారు 32,500 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. గతంలో బుడమేరు వరదలతో ఎదురైన ఇబ్బందులు ఇంకా ప్రజల కళ్లముందే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి వరద ముప్పు పొంచి ఉందన్న అంచనాలు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నాయి.బుడమేరుతో పాటు ఎర్రకాల్వ, గోనెలవాగు, జల్లేరు, పంపా తదితర జలవనరుల్లోనూ భారీ వరద ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఆయా వాగులు, కాల్వల పరిసరాల్లోని గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. వరద నీరు ఎటువైపు ప్రవహిస్తుంది? ఏ ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది? ఎక్కడ ప్రజలను తరలించాలి? అనే అంశాలపై ముందుగానే ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

జలాశయాల్లో నీటి నిల్వలు, గేట్ల నిర్వహణ, దిగువ ప్రాంతాలకు వరద విడుదల వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. వాగులు, కాల్వల వద్ద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రమాద హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు.

15 వేల విద్యుత్ స్తంభాలకు ముప్పు..

తుఫాను సమయంలో బలమైన గాలులు విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం కలిగించే ప్రమాదం ఉంది. 12 జిల్లాల్లో సుమారు 12,102 నుంచి 15,128 విద్యుత్ స్తంభాలు దెబ్బతినే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. విద్యుత్ లైన్లు తెగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, సరఫరా నిలిచిపోవడం వంటి సమస్యలు తలెత్తవచ్చని వివరించారు.

దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. అవసరమైన సిబ్బంది, వాహనాలు, క్రేన్లు, మరమ్మతు పరికరాలు, విద్యుత్ స్తంభాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి అదనపు సిబ్బందిని రప్పించి ప్రభావిత జిల్లాల్లో అందుబాటులో ఉంచాలన్నారు.

విద్యుత్ స్తంభాలు నేలకొరిగితే ఎన్ని గంటల్లో పునరుద్ధరణ చేపట్టగలరు? ఎప్పటిలోగా సరఫరాను పూర్తిస్థాయిలో అందించగలరు? అనే అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ఉండాలని సీఎం పేర్కొన్నారు. ప్రజలకు కూడా పునరుద్ధరణ సమయంపై సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర సేవలకు విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

నాలుగు గంటలకోసారి బులెటిన్..

తుఫాను తీవ్రత, దిశ, గాలుల వేగం, వర్షపాతం, వరద పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించడమే లక్ష్యంగా ప్రతి నాలుగు గంటలకు ఒకసారి అధికారిక బులెటిన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వాతావరణ మార్పులపై ప్రజలకు ముందస్తు హెచ్చరికలు చేరేలా సమాచార వ్యవస్థను సమన్వయం చేయాలని సూచించారు.

ముఖ్యంగా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్ సేవలకు అంతరాయం కలగకుండా టెలికాం సంస్థలు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మొబైల్ టవర్లకు విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ విద్యుత్ వనరులు, జనరేటర్ల ఏర్పాట్లపై దృష్టి పెట్టాలన్నారు. తుఫాను సమయంలో నెట్‌వర్క్ నిలిచిపోతే సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు.

ఇటీవల వచ్చిన అర్నబ్ తుఫాను సమయంలో నెట్‌వర్క్ సంస్థలు మరింత ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఉంటే బాగుండేదని సీఎం అభిప్రాయపడ్డారు. ఈసారి అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ముందుగానే అప్రమత్తం కావాలని సూచించారు.

అర్నబ్ నష్టం.. పునరుద్ధరణపై ఆరా..

ఇదిలా ఉండగా, ఇటీవల అర్నబ్ తుఫాను కారణంగా రాష్ట్రంలో జరిగిన నష్టం, సహాయక చర్యల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణపై చంద్రబాబు ఆరా తీశారు. ఏయే ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోయింది? ఎక్కడ మరమ్మతులు పూర్తయ్యాయి? ఇంకా ఎక్కడ పునరుద్ధరించాల్సి ఉంది? అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు.అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను ఆదివారం రాత్రికల్లా పునరుద్ధరిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఇప్పటికే దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతు పనులను వేగవంతం చేసినట్లు వివరించారు.

అధికార యంత్రాంగానికి సీఎం దిశానిర్దేశం..

మరో తుఫాను ముప్పు నేపథ్యంలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని చంద్రబాబు స్పష్టం చేశారు. రెవెన్యూ, విపత్తు నిర్వహణ, పోలీసు, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ఆహారం, మందులు, అత్యవసర సేవలు అందుబాటులో ఉంచాలన్నారు.లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడం, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం, గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.తుఫాను తీరం దాటే సమయం దగ్గరపడుతున్న కొద్దీ అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. ముందస్తు హెచ్చరికలతో పాటు క్షేత్రస్థాయిలో సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.

ఆపదలో ఉన్న మహిళకు అండగా నిలిచిన పోలీసులకు డీజీపీ అభినందనలు

ఎల్లారెడ్డిపేట పోలీసుల మానవత్వానికి ఉన్నతాధికారుల ప్రశంసలు

జిల్లా పోలీసుల సేవలను అభినందించిన రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ప్రజల రక్షణే కాదు. ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించడం కూడా పోలీసుల బాధ్యత అని చాటిచెప్పిన ఎల్లారెడ్డిపేట పోలీసులు ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని మొదటి బైపాస్ రోడ్డుపై ఫిట్స్‌తో అకస్మాత్తుగా కుప్పకూలిన మహిళను గమనించిన కానిస్టేబుల్ ప్రశాంత్, హోంగార్డు శ్రీనివాస్ వెంటనే స్పందించి ఆమెకు ప్రథమ చికిత్స అందించి, మానవత్వాన్ని చాటుకున్నారు.

సకాలంలో స్పందించి మహిళకు సహాయం అందించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన జిల్లా పోలీస్ శాఖ అధికారిక సోషల్ మీడియా పోస్టును పరిశీలించిన రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ గారు స్పందిస్తూ. విధి నిర్వహణలో మానవత్వాన్ని చాటుకున్న పోలీసులను అభినందించారు. వారి సేవలను గుర్తించి తగిన విధంగా ప్రశంసించి, రివార్డులు అందించాలన్నారు.

ప్రతిభకు పట్టం,బతుకమ్మ విజేతలకు బహుమతులు:ముద్దం

యువతను ప్రోత్సహిస్తున్న నేతలు.ప్రజలకి పండుగలతో దగ్గరౌతున్న నాయకులు

హ్యాట్రిక్ నేతకు హాట్సాఫ్ అందరం మీతోనే అంటూ ఆనందంతో కేరింతలు

ముందు చూపు ఉన్న నేత, నాతో జత కట్టు అంటున్న రాజా.నీతో మేమున్నాం అంటున్న ప్రజలు





కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)బతుకమ్మ అనేది తెలంగాణ సంస్కృతికి, ఆడపడుచుల ఆత్మగౌరానికి ప్రతీకైనా అద్భుతమైన పండుగ.వర్షాకాలం చివరిలోగునుగు,తంగేడు,బంతి వివిధ రకమైన అడవి పూలు వికసిస్తాయి,ఎన్నో ఔషధ గుణాలున్న పూలను దసరా నవరాత్రులలో ఎంగిలిపూల బతుకమ్మగా ప్రారంభమై 9వ రోజున సద్దుల బతుకమ్మగా రోజుకో తీరు పువ్వులతో అందంగా అమర్చి వాటిని చెరువులలో నిమజ్జనం చేస్తారు.అయితే దీనివల్ల నీటి వనరులు శుద్ధి అవుతాయని జలచరాలు ఆరోగ్యంగా ఉంటాయని మన నమ్మకం.

ఆదరణను నోచుకోని బతుకమ్మ వేడుక..

2014 జూన్ 2వ తేదీన తెలంగాణ ఆవిర్భవ దినోత్సవం అది అందరికీ తెలిసిన విషయమే,కానీ గత ప్రభుత్వం అదే ఏడాది బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా జరిపించడమే కాకుండా మాజీ తెలంగాణ రాష్ట్ర సీఎం కేసీఆర్ ఆడపడుచులకు పండుగ సందర్భంగా చీరలు అందజేసిన విషయం విదితమే.మరో విషయం ఏమిటంటే గ్రామాలకే పరిమితమైన బతుకమ్మ పండుగను నగరం నడిబొడ్డున ఉండే హుస్సేన్ సాగర్ కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బతుకమ్మ పండుగ వేడుకలను నిర్వహించారు. అలాగే ఇప్పటి మహిళలు పాటలు,ఆటలు రాక డిజేలకి,నేతలు ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటున్నారు. ఉదాహరణకి బతుకమ్మ పండుగ సందర్భంగా సంగారెడ్డి వీధులన్నీ పూలతో విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు సంగారెడ్డిలో మాజీ కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో వేలాది మంది మహిళలు పాల్గొని బతుకమ్మ పాటలకు డాన్స్ చేస్తూ సందడి చేసిన విషయం తెలిసిందే.

ముద్దం వాకిట్లో ఆడపడుచుల బతుకమ్మ సంబరాలు

కూకట్ పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజలను ఏకం చేయాలన్న ఆలోచనతో "దేవీ నవరాత్రుల"బతుకమ్మ వేడుకలు దృశ్య స్థానిక మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ నేతృత్వంలో"బంగారు బతుకమ్మ సెల్ఫీ"పోటీలను నిర్వహించారు.అయితే ఈ పోటీల్లో మహిళలు బతుకమ్మ పండుగ విశిష్టతను తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవడంలో మహిళల పాత్ర ఎంత గొప్పదని తెలియజేస్తూ వారిని విజేతలుగా ప్రకటిస్తానని ఆయన ఓ సందర్భంలో పేర్కొన్నారు. ఈ క్రమంలో స్థానిక మహిళలు పార్టీలకు,కుల మతాలకి అతీతంగా బతుకమ్మని అలంకరించడంలో వారి సృజనాత్మక నైపుణ్యాన్ని చాటారు.మరి కొందరు బతుకమ్మ పాటలకి చేతులతో చప్పట్లు కొడుతూ ఆ గిరిలో తిరుగుతూ ప్రతిభను చూపారు.ఇక మరికొందరు విషయం వస్తే వయస్సుతో సంబంధం లేకుండా చీరకట్టులో సాక్షాత్తు అమ్మవారిని తలపించేలా కట్టుబొట్టులతో వేడుకల్లో పాల్గొన్నారు.ఇదంతా చూస్తుంటే ఓల్డ్ బోయిన్‌పల్లి నగరం పల్లెటూరు వాతావరణం సంతరించుకుంది.ఈ కార్యక్రమాన్ని ఇంత గొప్పగా ఏర్పాటు చేసినందుకు వేల సంఖ్యలో మహిళలు డివిజన్ మాజీ కార్పొరేటర్ ని అభినందించారు.మరీ ముఖ్యంగా వయస్సు మీద పడ్డ వృద్ధులు వారి చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయని"ముద్దంని ముద్దాడారు".అలాగే ఈ పోటీలో విజేతలుగా నిలిచిన వారు మొదటి బహుమతిని జ్యోతికి అందించారు, 2వ బహుమతి లలిత గౌడ్,3వ బహుమతి తేజశ్రీ,4వ భాగమతి సుప్రియ,5వ బహుమతి సాయిలీలలకు అందించారు.ఈ పోటీ నగరంలో నిత్యం తలమునకలవుతున్న మహిళామణులకు బతుకమ్మ పోటీలు ద్వారా వారి జీవితంలో చిరస్మరణీయకంగా నిలిచిపోయే విధంగా నిర్వహించిన నిర్వాహకులు.

ప్రజాస్వామ్యంపై జగన్ నీతులా.. గతంలో ఏకగ్రీవాల సంగతేంటి

-పులివెందుల ఎన్నికలపై లోకేశ్ ఎదురుదాడి

-గతంలో ప్రతి వార్డునూ ఏకగ్రీవం చేశారంటూ విమర్శ

-ఇప్పుడు పారదర్శకంగానే స్థానిక ఎన్నికలు

-నామినేషన్లకు పోలీసు భద్రత కల్పించాం

-పులివెందులలో ఉద్రిక్తతలకు జగన్ వైఖరే కారణం

-బెంగళూరులో మీడియాతో మంత్రి నారా లోకేశ్



బెంగళూరు(ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. పులివెందులలో ఎన్నికల నిర్వహణ, ఏకగ్రీవాల వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. ప్రజాస్వామ్యం గురించి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పులివెందులలో ప్రతి వార్డునూ ఏకగ్రీవం చేశారని ఆరోపించారు. ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు.బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించిన అనంతరం స్థానిక ఎన్నికలపై లోకేశ్ మీడియాతో మాట్లాడారు. ప్రజాప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందని, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో లేని సమస్యలు పులివెందులలోనే ఎందుకు తలెత్తుతున్నాయని ప్రశ్నించారు.

నామినేషన్లకు భద్రత కల్పించాం..

పులివెందులలో నామినేషన్లు వేసేందుకు ఎవరినీ అడ్డుకోలేదని, అభ్యర్థులకు పోలీసు భద్రత కూడా కల్పించామని మంత్రి తెలిపారు. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేశారని పేర్కొన్నారు. అయినప్పటికీ అక్కడ శాంతిభద్రతల సమస్యను సృష్టించారని ఆరోపించారు. గత రాత్రి వాహనాలను తగులబెట్టి, ఆ ఘటనకు ప్రభుత్వాన్ని బాధ్యులుగా చూపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలపై దాడులు చేసి, తిరిగి తమపైనే ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

బెంగళూరు నుంచి వచ్చి.. తిరిగి వెళ్లారా..

ఎన్నికల షెడ్యూల్ ముందే ప్రకటించినప్పటికీ జగన్ బెంగళూరులోనే ఉంటున్నారని లోకేశ్ విమర్శించారు. ఆదివారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి పులివెందులకు వచ్చి అక్కడ ఉద్రిక్త పరిస్థితులకు కారణమయ్యారని ఆరోపించారు. అనంతరం హెలికాప్టర్‌లో తిరిగి బెంగళూరుకు వెళ్లిపోయారని పేర్కొన్నారు. జాతీయ మీడియాను పిలిచి రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య ఉందంటూ ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

గత ఏకగ్రీవాలపై సమాధానం చెప్పాలి..

గత ఎన్నికల్లో పులివెందులలో అన్ని వార్డులు ఏకగ్రీవం కావడానికి కారణాలేంటో జగన్ ప్రజలకు వివరించాలని లోకేశ్ డిమాండ్ చేశారు. అప్పట్లో ప్రజాస్వామ్య ప్రక్రియకు విఘాతం కలిగించారని ఆరోపిస్తూ, ఇప్పుడు తమ ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తోందని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ర్యాలీలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు.విశాఖపట్నం, కడప నగరాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని లోకేశ్ పేర్కొన్నారు. పులివెందులలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై జగన్ వైఖరే కారణమని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

ఎల్‌నినో ముప్పుపై ముందస్తు అప్రమత్తత

- జగిత్యాల జిల్లాలో నీటి భద్రతకు సమగ్ర కార్యాచరణ

- రానున్న 7--8 నెలల తాగునీటి అవసరాలపై మంత్రి అడ్లూరి ప్రత్యేక సమీక్ష

జగిత్యాల (ప్రశ్న న్యూస్)ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేస్తూ జగిత్యాల జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా, రైతాంగానికి నష్టం వాటిల్లకుండా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సమగ్ర కార్యాచరణ చేపట్టింది. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవతో రానున్న 7--8 నెలల నీటి అవసరాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి ముందస్తు ప్రణాళికలకు దిశానిర్దేశం చేశారు.జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నీటి సంరక్షణ పనులను పరిశీలించడంతో పాటు వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచుతున్నారు. వర్షపు ప్రతి చుక్కను ఒడిసిపట్టడం, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలను కాపాడటం, భూగర్భ జలాలను పెంపొందించడం ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకున్నారు.జిల్లాలో ఇప్పటివరకు 815.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 896.7 మిల్లీమీటర్లతో పోలిస్తే 9 శాతం లోటు ఉంది. ఇప్పటివరకు 51 వర్షపు రోజులు నమోదయ్యాయి. భీమారం, గొల్లపల్లి, ఇబ్రహీంపట్నం మండలాల్లో వర్షపాతం లోటు కనిపిస్తోంది. జగిత్యాల రూరల్, జగిత్యాల, కోడిమ్యాల మండలాలను మోస్తరు కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. ఆయా మండలాల్లో పంట దిగుబడులు 37, 34, 41 శాతం మేర తగ్గే అవకాశం ఉందని అంచనా వేయడం ఆందోళన కలిగిస్తోంది.

ఈ నేపథ్యంలో అక్టోబర్ 22న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. వచ్చే జూన్ వరకు మిషన్ భగీరథ ద్వారా నిరంతర తాగునీటి సరఫరా జరిగేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నీటి వనరుల్లో ప్రస్తుతం ఉన్న నిల్వలు, భవిష్యత్తు అవసరాలను అంచనా వేసి ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.వ్యవసాయ రంగంలోనూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగును ప్రోత్సహించాలని, అధిక నీటి అవసరమయ్యే వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, పత్తి, కందులు వంటి పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని నీటి సంరక్షణ పనులతో



అనుసంధానించి గ్రామాల్లో శాశ్వత నీటి వనరులను అభివృద్ధి చేయాలని సూచించారు.మొత్తంగా ఎస్సారెస్పీ, కాలువలు, చెరువుల్లోని నీటి నిల్వలను సమర్థంగా వినియోగించుకోవడం, భూగర్భ జలాల పెంపు, ప్రత్యామ్నాయ పంటల సాగు, తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో జగిత్యాల జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతోంది. ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నా ప్రజలకు తాగునీటి కొరత రాకుండా, రైతాంగం నష్టపోకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు.

వ్యాయామం లేకుండా విటమిన్ మాత్రలు వాడినా ప్రయోజనం ఉండదు

- ఇది నిపుణుల మాట!



శరీరానికి బలం చేకూర్చేందుకు, ఎముకలను దృఢంగా ఉంచుకునేందుకు చాలామంది ప్రోటీన్, కాల్షియం, విటమిన్ డి వంటి సప్లిమెంట్లపై ఆధారపడుతుంటారు. అయితే, శారీరక శ్రమ లేకుండా తీసుకునే సప్లిమెంట్ల వల్ల కలిగే ప్రయోజనం చాలా పరిమితమని, కొన్నిసార్లు అది వృథా ప్రయాసే అవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇండియన్ ఎక్స్ ప్రెస్ కథనం ప్రకారం ఇటీవల ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఆదిత్య సాయి ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన ఓ పోస్ట్ ఈ చర్చకు దారితీసింది. సప్లిమెంట్ల కన్నా వ్యాయామమే ముఖ్యమని ఆయన తన వీడియోలో పేర్కొన్నారు.

చాలామంది కేవలం నడకతో సరిపెట్టి, కండరాలకు బలాన్నిచ్చే స్ట్రెంత్ ట్రైనింగ్‌ను నిర్లక్ష్యం చేస్తారని, అలాంటప్పుడు సప్లిమెంట్లు తీసుకున్నా అవి సమర్థంగా పనిచేయవని ఆయన తెలిపారు. ప్రోటీన్, యాంటీఆక్సిడెంట్లు కండరాల నిర్మాణానికి, వాపుల తగ్గింపునకు సహాయపడతాయని, కానీ వ్యాయామం చేయనిదే వాటి పూర్తి ప్రయోజనం శరీరానికి అందదని వివరించారు.ఈ విషయంపై నారాయణ హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జరీ కన్సల్టెంట్ డాక్టర్ అతుల్ శ్రీవాస్తవ మరింత లోతుగా విశ్లేషించారు. వ్యాయామం చేయకపోయినా సప్లిమెంట్లు కొంతమేర సహాయపడతాయని, అయితే అది కేవలం శరీరంలో ఉన్న పోషకాహార లోపాలను (ఉదాహరణకు కాల్షియం, విటమిన్ డి లోపం) సరిదిద్దడానికి మాత్రమేనని స్పష్టం చేశారు. సప్లిమెంట్లను వ్యాయామానికి ప్రత్యామ్నాయంగా ఎట్టిపరిస్థితుల్లోనూ చూడకూడదని ఆయన గట్టిగా చెప్పారు."ఎముకలు, కండరాలు కదలికలకు స్పందిస్తాయి. నడక వంటి సాధారణ బరువు మోసే వ్యాయామాలు కూడా ఎముకల సాంద్రతను, కండరాల బలాన్ని, శరీర సమతుల్యతను కాపాడతాయి. ఎక్కువ కాలం కదలకుండా ఒకేచోట కూర్చోవడం వల్ల కండరాలు బలహీనపడతాయి, కీళ్ల కదలికలు తగ్గి ఎముకల సాంద్రత క్షీణిస్తుంది" అని డాక్టర్ శ్రీవాస్తవ వివరించారు.

వ్యాయామం అంటే కేవలం జిమ్‌కు వెళ్లడమే కాదని ఆయన అన్నారు. వృద్ధులు, గాయాల నుంచి కోలుకుంటున్న వారు, కీళ్ల నొప్పులతో బాధపడేవారు కూడా నడక, స్ట్రెచింగ్, ఫిజియోథెరపిస్ట్ సూచించిన తేలికపాటి కదలికల ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో ప్రాచుర్యం పొందాయని, అందరూ వాడుతున్నారని గుడ్డిగా సప్లిమెంట్లను వాడటం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రతి వ్యక్తి శరీరం, అవసరాలు వేర్వేరుగా ఉంటాయి. అవసరం లేకున్నా లేదా అధిక మోతాదులో సప్లిమెంట్లు వాడటం వల్ల హాని కలిగే అవకాశం ఉంది. అందుకే ఏవైనా సప్లిమెంట్లు ప్రారంభించే ముందు వైద్యులను సంప్రదించి, అవసరమైన పరీక్షలు చేయించుకుని, వారి సలహా మేరకే వాడటం శ్రేయస్కరం. అంతిమంగా, ఆరోగ్యకరమైన జీవనశైలిలో సప్లిమెంట్లు కేవలం సహాయకాలు మాత్రమేనని, క్రమం తప్పని వ్యాయామం, సరైన పోషకాహారం వాటికి ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోవాలి.



రవితేజ 'ఇరుముడి' నిర్మాతలకు తెలంగాణ కార్మిక శాఖ నోటీసులు

బాలనటి నిబంధనలపై విచారణకు ఆదేశం!

మాస్ మహారాజా రవితేజ హీరోగా, శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్‌బస్టర్ సినిమా 'ఇరుముడి' మరో వివాదంలో చిక్కుకుంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన బాలనటి నక్షత్రకు సంబంధించి చట్టపరమైన నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలు రావడంతో, ప్రముఖ నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' నిర్మాతలకు తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ తాజాగా అధికారిక నోటీసులు జారీ చేసింది. 'జై లోక్‌సత్తా సోషల్ జస్టిస్ ఫోరం' నుంచి అందిన ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఈ చర్యలు చేపట్టారు. సినిమాలో మైనర్ బాలికతో షూటింగ్ నిర్వహించడం, అలాగే వివిధ ప్రమోషనల్ కార్యక్రమాల్లో ఆమెను భాగస్వామ్యం చేయడంపై పలు కీలక అంశాలపై అధికారులు స్పష్టత కోరారు. మైనర్ బాలికతో నటింపజేయడానికి గాను జిల్లా మేజిస్ట్రేట్ నుంచి ముందుగా అధికారిక అనుమతి తీసుకున్నారా, ఆమె తల్లిదండ్రుల నుంచి రాతపూర్వక సమ్మతి పత్రం పొందారా అని ప్రశ్నించారు. అలాగే షూటింగ్ సమయంలో బాలికకు సంబంధించిన కాల్‌షీట్లు, అటెండెన్స్ రికార్డులు, ఆమె పనిచేసిన ఖచ్చితమైన పని గంటల వివరాలను సమర్పించాలని ఆదేశించారు. సినిమా షూటింగ్ కారణంగా బాలిక చదువుకు ఎటువంటి ఆటంకం కలగకుండా తీసుకున్న చర్యలు, సెట్‌లో ఆమె భద్రత, సంక్షేమం కోసం ప్రత్యేకంగా కేర్‌టేకర్‌ను నియమించారా అనే వివరాలు కోరారు.

చట్ట నిబంధనల ప్రకారం మైనర్ బాలికకు చెల్లించిన పారితోషికంలో కనీసం 20 శాతాన్ని ఆమె పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారా అని అడిగారు. కేవలం సినిమా షూటింగ్‌కే కాకుండా, ప్రీ-రిలీజ్ వేడుకలు మరియు ఇతర ప్రమోషనల్ కార్యక్రమాలలో మైనర్ బాలిక పాల్గొనే విషయంలో చట్టపరమైన నిబంధనలు ఏమేరకు పాటించారనే దానిపై వివరణ ఇవ్వాలని సూచించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని రికార్డులు మరియు పూర్తి ఆధారాలతో నవంబర్ 4న ఉదయం 11 గంటలకు జరిగే విచారణకు స్వయంగా లేదా అధీకృత ప్రతినిధి ద్వారా హాజరు కావాలని నిర్మాతలను అధికారులు స్పష్టం చేశారు. బాలల హక్కులు, చట్టాల అమలుపై ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రస్తుతం టాలీవుడ్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఇన్నర్స్ లేకుండా యాక్షన్ సీన్ చేయాలన్నారు

రెండు వారాలు వేధించారు: రాధికా ఆప్టే



నటి రాధికా ఆప్టే మరోసారి తనకు ఎదురైన చేదు అనుభవాన్ని బయటపెట్టారు. సినిమా సెట్స్‌లో మహిళా నటీమణులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. తన తాజా వెబ్‌సిరీస్ 'అక్క' ప్రమోషన్లలో పాల్గొన్న రాధికా.. గతంలో ఓ సినిమా షూటింగ్ సమయంలో దర్శకుడు, చిత్రబృందం తనను ఇబ్బందికరమైన డిమాండ్లతో వేధించారని వెల్లడించారు. బ్రా లేకుండా, షర్ట్ బటన్లు విప్పి యాక్షన్ సీన్‌లో నటించాలని అడిగారని తెలిపారు. ఓ సినిమా షూటింగ్‌లో యాక్షన్ సీన్ చిత్రీకరణకు రెండు రోజుల ముందు దర్శకుడు, ఆయన బృందం తన దగ్గరకు వచ్చారని రాధికా ఆప్టే చెప్పారు. బ్రా లేకుండా కేవలం షర్ట్ వేసుకుని, బటన్లు విప్పి ఫైట్ సీన్ చేయగలరా? అని నేరుగా అడిగారని వెల్లడించారు. వారి మాటలు విని ఆశ్చర్యపోయానని, యాక్షన్ సీన్‌లో శరీరం కదిలినప్పుడు షర్ట్ పక్కకు జరిగే అవకాశం ఉంటుందని, కనీస లాజిక్ ఆలోచించరా? అని ఎదురు ప్రశ్నించినట్లు తెలిపారు. దానికి వారు మరో అడుగు ముందుకేసి కేవలం బ్రా, అండర్‌వేర్‌తోనే ఆ సన్నివేశం చేయవచ్చుకదా అని అడిగారని చెప్పారు. అసలు తనతో ఏం చేయించాలని అనుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వివరించారు. సినిమా కథ చెప్పినప్పుడు, ఒప్పందం చేసుకున్నప్పుడు ఇలాంటి సన్నివేశాల గురించి ఎలాంటి సమాచారం ఇవ్వలేదని రాధికా ఆప్టే పేర్కొన్నారు. ఒకవేళ నగ్నత్వం లేదా శరీర ప్రదర్శనకు సంబంధించిన సన్నివేశాలు అవసరమైతే ముందుగానే స్పష్టంగా చెప్పాలని అభిప్రాయపడ్డారు. షూటింగ్ సమయానికి వచ్చి ఎంతవరకు చూపించాలి? ఏం చూపించాలి? అంటూ పదేపదే చర్చలు జరుపుతూ దాదాపు రెండు వారాల పాటు తనను ఇబ్బంది పెట్టారని వెల్లడించారు. ఈ పరిణామాల వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యానని తన అనుభవాన్ని పంచుకున్నారు. సినిమాల్లో రొమాంటిక్, సన్నిహిత సన్నివేశాల చిత్రీకరణ సమయంలో నటీనటుల అంగీకారం, సౌకర్యం, భద్రతను పర్యవేక్షించేందుకు సాన్నిహిత్య సమన్వయకర్తలు ఉంటారు. అయితే వారి పరిస్థితి కూడా పరిశ్రమలో అంత సులభంగా లేదని రాధికా అన్నారు. నిర్మాతలు చెప్పినట్లే వారు కూడా వ్యవహరించాల్సి వస్తోందని, నటీమణులకు మద్దతుగా మాట్లాడితే కొందరు నిర్మాతలు వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు.

పరిశ్రమలో అందరూ ఇలాగే ఉంటారని తాను చెప్పడం లేదని, కానీ కొందరు చేసే అనుచిత ప్రవర్తన వల్ల సినిమా సెట్స్‌లో నటీమణులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

అది సినిమా కాదు, చరిత్ర..

సీత పాత్రపై సాయి పల్లవి కీలక వ్యాఖ్యలు

ప్రముఖ నటి సాయి పల్లవి త్వరలో రానున్న 'రామాయణం' చిత్రంలో సీతాదేవి పాత్రలో కనిపించనున్న విషయం విదితమే. ఈ ప్రతిష్ఠాత్మక పాత్ర కోసం తాను ఎలా సిద్ధమైందీ ఆమె తాజాగా వెల్లడించింది. అమితాబ్ బచ్చన్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'కౌన్ బనేగా కరోడ్‌పతి' కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. ఈ పాత్ర పోషణలో ప్రార్థన, ధ్యానం కీలక పాత్ర పోషించాయని పేర్కొంది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ఈ పాత్ర కోసం నేను ప్రధానంగా ప్రార్థనలు చేశాను. ఎందుకంటే మేము తెరకెక్కిస్తున్నది కేవలం సినిమా మాత్రమే కాదు.. ఇది చరిత్రగా నిలిచిపోతుంది. భవిష్యత్ తరాలు కూడా దీనిని వీక్షిస్తాయి. అందుకే ఆ పాత్రకు తగిన గౌరవం ఉండాలనే ఉద్దేశంతో ప్రార్థనలకే ప్రాధాన్యమిచ్చాను" అని వివరించింది.షూటింగ్ సమయంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడానికి ధ్యానం ఎంతో తోడ్పడిందని సాయి పల్లవి తెలిపింది. "ఒత్తిడితో కూడిన పరిస్థితులు ఎదురైనప్పుడు.. 'ఇలాంటి సమయంలో సీతమ్మ ఎలా స్పందించేవారు?' అని ఆలోచించడం మొదలుపెట్టాను. ఆవేశపడకుండా ప్రశాంతంగా పరిస్థితులను గమనించడం సీతమ్మ పాత్ర నుంచే నేర్చుకున్నాను" అని ఆమె పేర్కొంది.నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ చిత్రంలో శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, లక్ష్మణుడి పాత్రలో రవి దూబే నటిస్తున్నారు.




బాలీవుడ్ దర్శకనిర్మాత సంజయ్‌గుప్తా కన్నుమూత



గ్యాంగ్‌స్టర్, అండర్‌వరల్డ్ నేపథ్య కథాంశాలను తెరకెక్కించడంలో సిద్ధహస్తుడిగా పేరు పొందిన ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు, నిర్మాత సంజయ్ గుప్తా (57) ముంబయిలో కన్నుమూశారు. శుక్రవారం రాత్రి తన ఇంటి బాత్రూమ్‌లో ప్రమాదవశాత్తు జారిపడటంతో ఆయన తలకు తీవ్రగాయమైందని సమాచారం. ఈ గాయం కారణంగానే ఆయన మరణించినట్లు తెలిసింది. 1994లో విడుదలైన 'ఆతిష్: ఫీల్ ద ఫైర్' చిత్రంతో దర్శకుడిగా పరిచయమయ్యారు సంజయ్‌గుప్తా. అయితే 'కాంటే' (2002) చిత్రం ఆయన కెరీర్‌కు బ్రేక్‌నిచ్చింది. సంజయ్‌దత్, అమితాబ్‌బచ్చన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా హీస్ట్ థ్రిల్లర్‌గా గుర్తింపు పొందింది. ఆ తర్వాత 'ముసాఫిర్' 'జిందా' 'షూటౌట్ ఎట్ లోఖండ్‌వాలా' 'షూటౌట్ ఎట్ వడాలా' 'కాబిల్' 'జజ్బా' 'ముంబై సాగా' వంటి చిత్రాలతో మంచి గుర్తింపును సంపాదించుకున్నారు. ముఖ్యంగా అండర్‌వరల్డ్, గ్యాంగ్ వార్, పోలీస్ ఎన్‌కౌంటర్‌లను కథాంశాలుగా ఎంచుకొని తనదైన శైలి స్టైలిష్ మేకింగ్‌తో ప్రేక్షకుల్ని మెప్పించారు. స్వీయ నిర్మాణ సంస్థ వైట్ ఫెదర్ బ్యానర్‌పై పలు విజయవంతమైన చిత్రాలకు నిర్మాతగా కూడా వ్యవహరించారు సంజయ్‌గుప్తా. చివరగా రెండేళ్ల క్రితం 'ది మిరిండా బ్రదర్స్' సినిమాను రూపొందించారు. సంజయ్‌గుప్తా మృతిపట్ల పలువురు బాలీవుడ్ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

ఓవర్సీస్ డీల్‌లో 'కింగ్' రికార్డ్



అగ్ర హీరో షారుఖ్‌ఖాన్ నటిస్తున్న తాజా చిత్రం 'కింగ్' విడుదలకు ముందే భారీ ఓవర్సీస్ ఒప్పందంతో వార్తల్లో నిలుస్తున్నది. ఈ సినిమా ఓవర్సీస్ థియేట్రికల్ హక్కులను దుబాయ్‌కి చెందిన ఫార్స్ ఫిల్మ్స్ 175కోట్లకు దక్కించుకున్నట్లు తెలిసింది. ఇప్పటివరకు భారతీయ సినిమాలకు లభించిన విదేశీ పంపిణీ హక్కుల కనీస హామీ ఒప్పందాల్లో ఇదే అత్యధికమని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. ఈ ఒప్పందం వల్ల నిర్మాతలపై కొంత ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంటుదని చెబుతున్నారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కింగ్' డిసెంబర్ 24న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో దీపికా పదుకోన్, షారుఖ్‌ఖాన్ తనయ సుహానా ఖాన్, అభిషేక్ బచ్చన్, అనిల్ కపూర్, రాణీ ముఖర్జీ తదితరులు ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు.

'సీన్' ట్రైలర్ వచ్చేసింది.. అంచనాలు పెంచుతున్న సూర్య-నస్లెన్ మైండ్ గేమ్!



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, టాలెంటెడ్ డైరెక్టర్ జీతూ మాధవన్ కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ మూవీ 'సీన్'. మలయాళ సెన్సేషన్స్ నజ్రియా నజీమ్, నస్లెన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ ట్రైలర్ తాజాగా విడుదలై ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. 'ఆవేశం' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాను తెరకెక్కించిన జీతూ మాధవన్ ఈ చిత్రాన్ని పూర్తి డార్క్ కామెడీ, యాక్షన్ మరియు ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌గా రూపొందించినట్లు ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. ఈ చిత్రంలో సూర్య పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఎవరినీ లెక్కచేయని తిరుగులేని లెజెండ్ కాప్ 'ఇన్‌బరాజ్' పాత్రలో కనిపించనున్నారు. కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు సడన్‌గా ఆయన ఉద్యోగానికి రాజీనామా చేయాలని నిర్ణయించుకోవడంతో ట్రైలర్ ఆసక్తికరంగా మొదలవుతుంది. రాజీనామా తర్వాత ఏం చేస్తావంటే.. రాజకీయాల్లోకి వెళ్తానంటూ సూర్య చెప్పే డైలాగ్ నవ్వులు పూయిస్తుంది. కథలో భాగంగా ఓ ప్రమాదకరమైన, అత్యంత క్రూరమైన సైకో కిల్లర్ 'ఈశ్వర్' (నస్లెన్) ఆట కట్టించడానికి మాజీ పోలీస్ అయిన ఇన్‌బరాజ్ మళ్లీ రంగంలోకి దిగాల్సి వస్తుంది. సూర్యకు సమానమైన తెలివితేటలతో నస్లెన్ నడిపించే మైండ్ గేమ్స్, ఇద్దరి మధ్య జరిగే క్యాట్ అండ్ మౌస్ చేజ్ ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇక చిత్రంలో 'మాయ' అనే పాత్రలో నటిస్తున్న నజ్రియా గ్లామర్‌తో పాటు కొన్ని పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాల్లోనూ కనిపించి అలరించారు. విలన్ బెదిరిస్తుంటే.. "అలెక్సా.. ఏదో ఒక మంచి మూడ్ మ్యూజిక్ ప్లే చెయ్" అంటూ సూర్య చెప్పే డైలాగ్ మరియు చివరిలో వచ్చే మాస్ విజువల్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. ఈ దీపావళి కానుకగా నవంబర్ 6న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. మలయాళ సంగీత సంచలనం సుషిన్ శ్యామ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా.. జగరం స్టూడియోస్ మరియు 2డి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది.

నాగార్జున సమర్పణలో 'ఇట్లు అర్జున'

మూగ యువకుడి ప్రేమకథగా రూపొందిన చిత్రం 'ఇట్లు అర్జున'. అనీష్, అనస్వర రాజన్ జంటగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా మహేష్ ఉప్పల దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. వెంకీ కుడుముల నిర్మాత. ఈ చిత్రానికి అగ్ర నటుడు నాగార్జున సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాను నవంబర్ 13న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'మూగ యువకుడు అర్జున్ చుట్టూ నడిచే కథ ఇది. అతను కీర్తి అనే అమ్మాయిని మౌనంగా ప్రేమిస్తుంటాడు. ఈ క్రమంలో ఆయన జీవితంలో ఎదురైన అనూహ్య సంఘటనలు ఏమిటన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. ప్రేమ, హాస్యం, సాహసం కలబోసిన హృద్యమైన కథ ఇది. నాగార్జునగారు ఈ సినిమా చూసి విభిన్నమైన కాన్సెప్ట్ అని అభినందించారు' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి తమన్ స్వరకర్త.



భగవంతుడు సర్వాంతర్యామి..

-నిస్వార్థంగా కోరుకున్న కోరికలు తీరుస్తాడు .

-భక్తి మార్గంలో నడిస్తే.. ధర్మమే మనల్ని రక్షిస్తుంది

-ధన్వాడ, మంథనిలో గణపతి సచ్చిదానంద స్వామిజీ దివ్య ప్రవచనం..

-స్వామి వారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలపై ఎల్లప్పుడూ ఉంటాయి..


-మంథని ప్రాంతంలో స్వామివారు అడుగుపెట్టడం గొప్ప అదృష్టం..

-రెండుమూడేళ్ల నిరీక్షణ ఫలించింది..

-రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు..

-స్వామివారి రాకతో పులకించిన మంథని గడ్డ





మంథని (ప్రశ్న న్యూస్)భగవంతుడు సర్వాంతర్యామి. అనేక రూపాలు.. కోటానుకోట్ల పేర్లు. ఏ విధంగా స్మరించినా భక్తులకు కనిపించి, వారి కోరికలు తీరుస్తారని అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. అయితే ఆ కోరికలు నిస్వార్థమైనవిగా, సహేతుకమైనవిగా ఉండాలని ప్రవచించారు. ఆదివారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆహ్వానం మేరకు ధన్వాడ, మంథనిలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులను ఉద్దేశించి స్వామీజీ ప్రసంగించారు.



భగవంతుడిని నిస్వార్థంగా స్మరిస్తూ, ధర్మాన్ని ఆచరిస్తే జీవితంలో విజయం సాధించవచ్చని, మానవసేవే మాధవసేవగా భావించి అహింసా మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు.

ధన్వాడకు స్వామివారి రాక.. భక్తుల ఆనందం

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆహ్వానం మేరకు ఆదివారం భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామానికి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ విచ్చేశారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో చేరుకున్న స్వామీజీకి మంత్రి శ్రీధర్‌బాబు హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికి, తోడ్కొని వచ్చారు. అనంతరం మంత్రి నివాసానికి చేరుకున్న స్వామీజీ, ధన్వాడలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో లోకకల్యాణార్థం నిర్వహించిన మహాపూర్ణాహుతి యజ్ఞంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులను ఉద్దేశించి దివ్య ప్రవచనం చేశారు.

భగవంతుడికి జయం అక్కర్లేదు.. భక్తులకు విజయాన్ని ప్రసాదిస్తారు

భగవంతుడు ఎక్కడో లేడని, మన హృదయాల్లోనే కొలువై ఉంటాడని స్వామీజీ పేర్కొన్నారు. మనం భగవంతుడిని పూలతో పూజించి, నైవేద్యం సమర్పిస్తామని, భక్తితో సమర్పించిన నైవేద్యాన్ని భగవంతుడు సూక్ష్మరూపంలో ఆరగిస్తారని వివరించారు. భగవంతుడికి జయం అవసరం లేదని, ఆయనను విశ్వసించే భక్తులకు విజయాన్ని అందిస్తారని అన్నారు. భగవంతుడిని కుటుంబ సభ్యుడిగా భావించి, మనస్ఫూర్తిగా ఆరాధించాలని సూచించారు. కోరికలు కోరడంలోనూ నిస్వార్థం, సహేతుకత ఉండాలని హితవు పలికారు. మనిషి ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా భగవంతునిపై విశ్వాసాన్ని కోల్పోకూడదని, ధర్మాన్ని పాటిస్తూ ముందుకు సాగాలని చెప్పారు.

బ్రిటిష్ కాలం నాటి తిరుపతి కథను వివరించిన స్వామీజీ

భగవంతుడి మహిమను వివరిస్తూ బ్రిటిష్ పాలన కాలంలో తిరుపతిలో జరిగిన ఒక కథను స్వామీజీ భక్తులకు వివరించారు. అప్పట్లో తిరుమల శ్రీవారికి నైవేద్యం సమర్పించే అర్చకులు, దేవుడికి సమర్పించిన నైవేద్యాన్ని వారే తింటున్నారని ఒక కలెక్టర్ అనుమానించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని నిరూపించాలనే సంకల్పంతో ప్రధాన అర్చకుడు, ఇతర అర్చకులతో కలిసి కలెక్టర్ సమక్షంలోనే నైవేద్యాన్ని సమర్పించారని చెప్పారు.తెర లేకుండా పూజలు నిర్వహించిన అనంతరం నైవేద్యాన్ని కలెక్టర్ ముందు ఉంచగా, ముందుగా సమర్పించిన ఆహారానికి, తర్వాత తీసుకొచ్చిన నైవేద్యానికి తేడా కనిపించిందని వివరించారు. ఈ ఘటనతో భగవంతుడి మహిమను గుర్తించిన కలెక్టర్ అర్చకులను అభినందించారని స్వామీజీ పేర్కొన్నారు. భగవంతుడి లీలలు అపారమని, ఆయన సర్వాంతర్యామి అని ఈ కథనం ద్వారా వివరించారు.

స్వామివారి రాకతో మంథని గడ్డ పులకించింది

ధన్వాడలో కార్యక్రమం అనంతరం స్వామీజీ రోడ్డు మార్గంలో మంథనికి చేరుకున్నారు. అక్కడి శివకిరణ్ గార్డెన్స్‌లో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు దర్శనమిచ్చి, వారిని ఉద్దేశించి ప్రసంగించారు. స్వామివారి రాకతో మంథని ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందారు.
మంథని ప్రాంతంలో స్వామివారు అడుగుపెట్టడం గొప్ప అదృష్టం..

రెండుమూడేళ్ల నిరీక్షణ ఫలించింది..

స్వామి వారు మంథని, ధన్వాడ ప్రాంతంలో అడుగుపెట్టడంపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు భావోద్వేగంగా మాట్లాడారు.

"స్వామివారి దర్శన భాగ్యం లభించాలంటే ఎన్నో ఏళ్లు నిరీక్షించాల్సి వస్తుంది. ఒక్క క్షణం, రెండు క్షణాలు స్వామివారి దివ్య ఆశీస్సులు పొందే అవకాశం లభించడం కూడా గొప్ప అదృష్టం. గత రెండుమూడేళ్లుగా మా అమ్మగారు జయశ్రీ, నా సతీమణి, కుటుంబ సభ్యులు స్వామివారు ఈ ప్రాంతానికి వచ్చి ప్రజలకు ఆశీర్వచనాలు అందించాలని కోరుకుంటున్నాం. ఇన్ని రోజుల నిరీక్షణకు నేడు ఫలితం దక్కింది" అని పేర్కొన్నారు. ధన్వాడలో దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని స్థాపించుకున్న తర్వాత స్వామివారు అక్కడికి విచ్చేసి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొనడం గొప్ప విశేషమని మంత్రి అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు శుభాశీస్సులు ఆశీర్వచనాలు అందించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ప్రముఖులు జిల్లా ఎస్పీ కలెక్టర్ ప్రజలు భక్తులు వేలాదిగా తరలివచ్చి పాల్గొనడం అభినందనీయమన్నారు.
స్వామివారి పాదాలకు నమస్కరించి, మంథని ప్రజల తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల కష్టాలు తొలగి.. సుఖసంతోషాలతో వర్ధిల్లాలి.

స్వామివారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ప్రజలు, ముఖ్యంగా మంథని, ధన్వాడ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రజల కష్టాలు తొలగిపోయి, అందరూ బాగుండాలని, ప్రశాంతంగా జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.
స్వామివారి దివ్య ఆశీస్సులతో ఈ ప్రాంత ప్రజలకు మంచి జరుగుతుందని, ఎన్ని కష్టాలు ఎదురైనా దత్తాత్రేయ స్వామివారి ఆశీస్సులతో వాటిని అధిగమించగలమనే విశ్వాసం ఉందని పేర్కొన్నారు. ఎల్లప్పుడు మంథని ప్రాంతం పై స్వామివారి ఆశీస్సులు ఆశీర్వాదం ఉంటాయని మంత్రి తెలిపారు. స్వామి వారికి అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కాన్‌సింగ్ దంపతులు, మంత్రి లక్ష్మణ్‌కుమార్ సతీమణి, జిల్లా కలెక్టర్ రామగుండం పోలీస్ కమిషనర్, స్థానిక ఆధ్యాత్మికవేత్తలు, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూముల రీ సర్వేలో నిర్లక్ష్యం

లైసెన్సుడ్ సర్వేయర్ లైసెన్స్ సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ గరిమ అగ్రవాల్



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియలో భాగంగా కేటాయించిన విధులు నిర్వర్తించడంలో అలసత్వం ప్రదర్శించిన లైసెన్సుడ్ సర్వేయర్ బాలకృష్ణ లైసెన్స్ ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సస్పెన్షన్ చేశారు. భూముల రీ సర్వేలో భాగంగా మొదటి దశలో జిల్లాలోని 70 గ్రామాల్లో రీ సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా, షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్లతో పాటు, ప్రభుత్వ ఆమోదం పొందిన లైసెన్సుడ్ సర్వేయర్లు భూముల రీ సర్వే ప్రక్రియలో పాల్గొంటున్నారు. గంభీరావుపేట మండలం కుర్దులింగంపల్లి గ్రామంలో భూముల రీ సర్వే కొనసాగుతుండగా, సర్వే కోసం కేటాయించిన లైసెన్సుడ్ సర్వేయర్ ఎం.బాలకృష్ణ గత కొన్ని రోజుల నుండి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ భూముల రీ సర్వే ప్రక్రియలో పాల్గొనకుండా, గైర్హాజరు కావడం పట్ల జిల్లా కలెక్టర్ సంబంధిత లైసెన్సుడ్ సర్వేయర్ పై చర్యలు తీసుకున్నారు. లైసెన్సుడ్ సర్వేయర్ బాలకృష్ణ లైసెన్స్ ను సస్పెన్షన్ చేస్తూ ఆదివారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియలో భాగస్వామ్యమైన అధికారులు అందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

నేడే బీజేపీ మహాపాదయాత్ర

- భారీగా తరలి రావాలన్న బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కా యశస్వి

- ముఖ్య అతిథిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

- మధ్యాహ్నం 3 గంటలకు జగ్‌జీవన్ రామ్ విగ్రహం ప్రారంభం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ స్టేట్ బ్యూరో చీఫ్ తేజవ్యాస్) ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నేతృత్వంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'మహా పాదయాత్ర'ను జయప్రదం చేయాలని భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కా యశస్వి పిలుపునిచ్చారు. ఈ చారిత్రాత్మక ప్రదర్శన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యువతను, పార్టీ శ్రేణులను ఆయన భారీ ఎత్తున హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా మల్కా యశస్వి మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ బద్ధ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్‌జీవన్ రామ్ విగ్రహం నుండి ప్రారంభమై ఎం.జె. మార్కెట్, ట్యాంక్ బండ్ వరకు సాగే ఈ మహా పాదయాత్రకు తెలంగాణ నలుమూలల నుండి యువత ప్రబల శక్తిగా తరలివస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.కేంద్ర హోం మంత్రి అమిత్ షా హాజరవుతున్న ఈ యాత్రను విజయవంతం చేసేందుకు బీజేవైఎం ఆధ్వర్యంలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని యశస్వి పిలుపునిచ్చారు. నగరంలో ఎక్కడికక్కడ యువ శ్రేణులతో భారీ బైక్ ర్యాలీలు, స్వాగత తోరణాలతో పాదయాత్ర మార్గాన్ని సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా, అలాగే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై ప్రతిపక్షాల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ "మహా పాదయాత్ర" లోక్‌తంత్ర బచావో – అరాచకత హటావో పేరుతో భారీ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఎన్నికల సంఘంపై నిందలు వేస్తూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజల్లో తిప్పికొట్టడం, కాంగ్రెస్ అరాచక పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని రక్షించడమే లక్ష్యంగా బీజేపీ ఈ యాత్రను చేపట్టింది.

దమ్మన్నపేట్ ప్రాథమిక పాఠశాలకు

స్మార్ట్ టీవీ ని బహూకరించిన

(పి ఆర్ టి యూ) అధ్యక్షులు వెంకట్ రాజరెడ్డి



ధర్పల్లి (ప్రశ్న న్యూస్)నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రం దమ్మన్నపేట్ ప్రాథమిక పాఠశాలకు ధర్పల్లి మండల (పి ఆర్ టి యూ) అధ్యక్షులు వెంకట్ రాజరెడ్డి 24 వేల రూపాయల విలువైన 50 ఇంచుల స్మార్ట్ టీవీ ని బహూకరించడం జరిగింది.దీనివలన మా విద్యార్థులకు డిజిటల్ క్లాసులు దీక్ష తరగతులు నిర్వహణకు సులభం అవుతుంది.మండలంలోని వివిధ పాఠశాలకు అందజేసినట్లుగానే మా పాఠశాల కూడా అందజేసినందుకు మా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం తరఫున ప్రత్యేక ధన్యవాదములు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి మండల విద్యాశాఖ అధికారి రమేష్,దమ్మన్నపేట్ గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్ గూండ్ల శ్రీనివాస్,గ్రామ పంచాయతీ సెక్రెటరీ శేఖర్,గ్రామ వి డి సి అధ్యక్షులు అతుకుల పెద్ద సాయన్న,కార్యదర్శి ఉమేందర్, పి ఆర్ టి యు ప్రధాన కార్యదర్శి సతీష్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు అంకం నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రవి రాజ్, మండల అసోసియేట్ అధ్యక్షులు సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షులు ప్రసన్న, మండల ఉపాధ్యక్షులు గజ్జి శ్రీనివాస్,గ్రామపంచాయతీ సిబ్బంది,విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అంబర్‌పేట నూతన ఎస్‌హెచ్‌ఓ కొత్తపల్లి ముత్తు

శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు



అంబర్ పేట (ప్రశ్న న్యూస్) అంబర్‌పేట పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించిన కొత్తపల్లి ముత్తు ని అంబర్‌పేట బీఆర్ఎస్ మైనారిటీ విభాగం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ కొత్తపల్లి ముత్తు బీఆర్ఎస్ నాయకులతో ఎంతో ఆత్మీయంగా ముచ్చటించారు. నాయకులందరినీ వ్యక్తిగతంగా పలకరిస్తూ, వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ ఆప్యాయతను కనబరిచారు. ఆయన చూపిన ఆత్మీయత, మర్యాద నాయకుల్లో సంతోషాన్ని కలిగించింది.ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ అంబర్‌పేట పరిధిలో శాంతిభద్రతలను కాపాడటం, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. సమాజంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా మైనారిటీ విభాగం నాయకులు పోలీస్ శాఖకు సహకరిస్తూ, ప్రజలకు మరియు పోలీసులకు మధ్య సమన్వయాన్ని పెంపొందించాలని, అంబర్‌పేటలో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.
బీఆర్ఎస్ మైనారిటీ విభాగం నాయకులు మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారం, సామాజిక సామరస్యం, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాల్లో పోలీస్ శాఖకు ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో జీవించేలా సమాజంలో మంచి వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ అఫ్రోజ్ పటేల్, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ మహమ్మద్ జాఫర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు షేక్ రఫీక్ అహ్మద్, షేక్ షానూర్, సయ్యద్ యూసుఫ్ బాబా, మీర్జా ఆదిల్ బేగ్, బీఆర్ఎస్ యువజన నాయకుడు మహమ్మద్ అజర్, మహమ్మద్ జమీల్ (యాబా) తదితరులు పాల్గొన్నారు.



ఓయూ గార్డెన్ల నిర్వహణలో అంతులేని నిర్లక్ష్యం

- పడిపోయిన చెట్లు చెదలపాలు, ఔషధ మొక్కల పెంపకం అటకెక్కిందా.?
- హార్టికల్చర్ విభాగం పనితీరుపై విద్యార్థి సంఘాల తీవ్ర ఆగ్రహం
- నిర్వహణ నిధులు ఏమవుతున్నాయి.? ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయి.?
- ఓయూ నిధుల వినియోగంపై స్టేట్ విజిలెన్స్, ఏసీబీ విచారణకు డిమాండ్





నేపథ్యంలో, ఇప్పటికే అందుబాటులో ఉన్న నిధులను సక్రమంగా వినియోగించలేని పరిస్థితి ఉంటే మరిన్ని నిధులు కేటాయించినా ప్రయోజనం ఏమిటని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ముఖ్యమంత్రికి ఓయూ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుండి ఇప్పటివరకు ఎన్ని నిధులు వచ్చాయి వాటిని ఖర్చు చేశారా లేక దుర్వినియోగం చేశారా ఒక్కొక్క అధికారి ఎన్ని కోట్ల అక్రమాలు చేశారు పూర్తిస్థాయిలో విచారణ చేయించి వాస్తవాలు బయటికి వచ్చిన తర్వాతనే ముఖ్యమంత్రి



ఓయూ (ప్రశ్న న్యూస్) వందేళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి, పచ్చదనం, ప్రకృతి పరిరక్షణకు నిలయంగా ఉండాల్సిన ల్యాండ్‌స్కేప్ గార్డెన్ నేడు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యూనివర్సిటీలోని డైరెక్టరేట్ ఆఫ్ హార్టికల్చర్ అండ్ యూనివర్సిటీ గార్డెన్స్ విభాగం ఆధ్వర్యంలో ఉండాల్సిన తోటలు, పార్కులు, ఔషధ మొక్కల పెంపకం, చెట్ల సంరక్షణపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. విభాగానికి డైరెక్టర్‌గా డాక్టర్ చెల్మల శ్రీనివాసులు బాధ్యతలు నిర్వహిస్తుండగా ఆయన ఓయూ జువాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా కూడా సేవలందిస్తున్నారు.

చెట్లు పడిపోతున్నా పట్టించుకునే వారేరీ.?

ఓయూ పరిధిలో ఎండిపోయి, నేలకొరిగిన చెట్లను గతంలో సేకరించి హాస్టళ్ల వంట అవసరాలకు వినియోగించేవారని, అవసరానికి మించిన కలపను టెండర్ల ద్వారా విక్రయించి యూనివర్సిటీకి ఆదాయం సమకూర్చేవారని విద్యార్థులు గుర్తుచేస్తున్నారు. అయితే ప్రస్తుతం పడిపోయిన చెట్లను సకాలంలో తొలగించకుండా అక్కడే వదిలేయడంతో అవి చెదలు పట్టి, నిరుపయోగంగా మారుతున్నాయని ఆరోపిస్తున్నారు. యూనివర్సిటీకి ఆదాయం సమకూర్చే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై రిజిస్ట్రర్, విసీలు ఏ రోజు పట్టించుకున్న పాపాన పోలేదన్న విమర్శలు ఉన్నాయి.

నిధుల ఖర్చుపై లెక్కలేవీ.?

ఓయూ పరిధిలో అసలు ఔషధ మొక్కల పెంపకం ఎక్కడ ఉందని వాటిని గాలికి వదిలేసి పచ్చదనం కోసం ఏవో ఒక చెట్లు పెంచడం తప్ప నలుగురికి ఉపయోగపడే ఔషధ మొక్కలను ఎందుకు పెంచడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్కుల అభివృద్ధి, గార్డెన్ల నిర్వహణ, మొక్కల సంరక్షణ కోసం కేటాయిస్తున్న నిధులు ఏ మేరకు ఖర్చవుతున్నాయి.? క్షేత్రస్థాయిలో జరిగిన పనులెన్ని.? ఖర్చు చేసిన నిధులకు సంబంధించిన బిల్లులు, రికార్డులు పారదర్శకంగా ఉన్నాయా.? అన్న ప్రశ్నలు విద్యార్థి సంఘాల నుంచి వినిపిస్తున్నాయి. చిన్నపాటి పనులకు సైతం భారీ మొత్తాలు ఖర్చు చేసినట్లు చూపిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఓయూ అభివృద్ధి కంటే వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమా.?

యూనివర్సిటీలోని పలు విభాగాల అధికారులపై గతంలోనూ అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు వచ్చాయని, కొందరు భారీ స్థాయిలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డ సొమ్ముతో వ్యవసాయ భూములు, ఫామ్‌హౌస్‌లు కొనుగోలు చేశారన్న ప్రచారం ఉందని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుండి ఇప్పటివరకు పూర్తిస్థాయిలో విచారణ చేయించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. యూనివర్సిటీ అభివృద్ధికి వినియోగించాల్సిన నిధులు దుర్వినియోగం అవుతున్నాయా.? అన్నది తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అంటున్నాయి.

రూ.1,000 కోట్ల హామీ.. ఉన్న నిధుల సంగతేంటి.?

ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన 1000 కోట్ల నిధులు కేటాయిస్తే బాగుంటుందని విద్యార్థి సంఘాలు సూచిస్తున్నాయి. ఎందుకంటే యూనివర్సిటీకి వస్తున్న నిధులలో చాలావరకు దుర్వినియోగం చేయడంతో పాటు స్వాహా జరుగుతుందని అవి సక్రమంగా వినియోగిస్తే దేశంలో నంబర్ వన్ యూనివర్సిటీగా ఓయూ ఉంటుందని విద్యార్థులు పేర్కొంటున్నారు.

విజిలెన్స్, ఏసీబీ విచారణ జరిపించాలి

హార్టికల్చర్ విభాగంతో పాటు ఓయూలోని ఇతర విభాగాలకు కేటాయించిన నిధులు, ఖర్చులు, కొనుగోళ్లు, టెండర్లు, నిర్వహణ పనులపై రాష్ట్ర విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అవసరమైతే ఏసీబీ రంగంలోకి దిగి రికార్డులు పరిశీలించాలని, అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి ఓయూ నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. లేకుంటే యూనివర్సిటీ అభివృద్ధి పేరుతో కేటాయించే నిధులు కూడా పక్కదారి పట్టే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నాయి.

రాప్తాడు రాక్షసుడిపై పోలీసుల తూటా

- నిందితుడిపై 6 రౌండ్ల కాల్పులు



అమరావతి (ప్రశ్న న్యూస్) అనంతపురం జిల్లా రాప్తాడు బాలికపై విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిందితుడు హేమంత్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. ఆత్మకూరు అటవీప్రాంతంలో నిందితుడు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఆరు రౌండ్ల కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. కాల్పుల్లో నిందితుడికి తీవ్ర గాయాలయ్యాయి. బుల్లెట్ గాయాలు అయిన నిందితుడిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాప్తాడులోని పాఠశాలలో తరగతి గదిలోకి చొరబడిన హేమంత్, అత్యంత అమానుష ఘాతుకానికి ఒడిగట్టాడు. పదోతరగతి చదువుతున్న బాలికపై ఎలక్ట్రిక్ రంపంతో విచక్షణారహితంగా దాడి చేసి ఆమెను ప్రాణాపాయ స్థితిలోకి నెట్టాడు. రాప్తాడు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన గోపిక రాప్తాడు జడ్పీ పాఠశాలలో చదువుతోంది. ఉదయం తరగతి గదిలో ఉండగా, వరుసకు బాబాయ్ అయ్యే హేమంత్ ఒక్కసారిగా ఎలక్ట్రిక్ రంపంతో లోపలికి ప్రవేశించి పాశవికంగా దాడికి పాల్పడ్డాడు. దీంతో 15 ఏళ్ల బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో లోతైన గాయాలయ్యాయి. తరగతిలో జరుగుతున్న ఈ దారుణాన్ని చూసి అంతా భయాందోళనకు గురయ్యారు. లక్ష్మి అనే విద్యార్థిని మాత్రం ధైర్యంగా ఉన్మాదిని అడ్డుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో ఆమె రెండు కాళ్లకూ తీవ్ర గాయాలయ్యాయి. అంతా కేకలు వేయడంతో నిందితుడు రంపాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. రక్తపుమడుగులో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న గోపిక, గాయపడిన లక్ష్మిని స్థానికులు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతోంది.

సీనియర్ జర్నలిస్ట్

డా. వేణుగోపాలకు ఘన సత్కారం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రవీంద్రభారతిలో సిద్ధేంద్ర ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, మాతృదేవోభవ చీఫ్ అడ్వైజర్, తెలంగాణ జర్నలిస్ట్స్ సెక్యూరిటీ సర్వీసెస్ (టీజేఎస్ఎస్) వైస్ ప్రెసిడెంట్ డా. వేణుగోపాలను ఘనంగా సత్కరించారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి దేవి ఆయనకు పురస్కారాన్ని అందజేసి అభినందించారు. జర్నలిజం రంగంలో ఆయన అందిస్తున్న సేవలను, సమాజం పట్ల ఆయనకున్న బాధ్యతను గుర్తిస్తూ ఈ పురస్కారంతో గౌరవించడం విశేషం. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొని డా. వేణుగోపాలకు అభినందనలు తెలిపారు.

మేడ్చల్‌లో కేటీఆర్‌కు ఘన స్వాగతం

పార్టీ జెండా ఆవిష్కరణ,

కేటీఆర్ రాకతో మేడ్చల్‌లో గులాబీ పండుగ



మేడ్చల్(ప్రశ్న న్యూస్)అదిలాబాద్ 'రైతు గర్జన' పర్యటనకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు మేడ్చల్ పట్టణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్ కేటీఆర్‌కు గుమ్మడికాయతో దిష్టి తీశారు. మహిళలు హారతులు పట్టారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన రాకతో మేడ్చల్‌లో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం, సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి చామకూర మహేందర్ రెడ్డి, ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ లావుడియా శ్రీదేవి రమేష్ నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ మాజీ కౌన్సిలరులు అమరం జైపాల్ రెడ్డి, అమరం హేమంత్ రెడ్డి, జవహర్ నగర్ కార్పొరేషన్ మాజీ మేయర్ మేకల కావ్య , ధమ్మాయిగూడ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్ సీనియర్ నాయకులు దయానంద్ యాదవ్ , ఆకిటి నవీన్ రెడ్డి, తో పాటు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్‌ను కాంక్రీట్ జంగిల్‌గా మారుస్తున్న సీసీ రోడ్లు

- రోడ్లు తవ్వడం.. పనులు వదిలేయడం.. ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపిస్తున్న జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు
- రెండు రోజుల్లో పూర్తయ్యే బీటీ రోడ్లను పక్కనపెట్టి.. నెలల తరబడి సాగే సీసీ రోడ్లకే ఎందుకంత ప్రాధాన్యం.?
- కమిషన్ల కోసమేనా సీసీ రోడ్లపై మోజు.? ప్రజాధనం వృథా అవుతున్నా పట్టించుకునే నాథుడే లేడా.?
- నాణ్యత లేని నిర్మాణాలు.. పదేళ్లలోపే మళ్లీ రోడ్లకు మరమ్మతులు.. ఇదేనా ఇంజనీరింగ్ అధికారుల పనితీరు.?
- తార్నాక,మెట్టుగూడ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం





సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని తార్నాక, మెట్టుగూడ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అధికారుల పనితీరుపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును తవ్వి నెలల కొద్ది వదిలివేయడం పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దానితోపాటు సిసి రోడ్డును తవ్వే సమయంలో డ్రైనేజీ పైపులు లీకు అయి మురుగునీరు నెలల కొద్ది రోడ్డుపై నిలిచిన ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్ పట్టించుకున్న పాపాన పోవడం లేదని మండిపడుతున్నారు. దుమ్ము, గుంతలు, రాకపోకలకు అంతరాయం నిత్యకృత్యంగా మారుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు సైతం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పాటుతున్న ప్రజాప్రతినిధులు మాత్రం నిమ్మకు నీరెత్తన్నట్లు వదిలేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తార్నాక (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్‌లో రోడ్ల అభివృద్ధి పేరుతో జరుగుతున్న పనులు ప్రజలకు ఉపశమనం కలిగించకపోగా కొత్త సమస్యలను సృష్టిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డును తవ్వడం, నిర్మాణ పనులు ప్రారంభించడం, ఆ తర్వాత రోజుల తరబడి వదిలేయడం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు పరిపాటిగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బీటీ రోడ్ల నిర్మాణానికి తక్కువ సమయం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, నెలల తరబడి సాగే సీసీ రోడ్ల పనులకే అధికారులు ఎందుకు మొగ్గుచూపుతున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.సీసీ రోడ్ల నిర్మాణం వెనుక నాణ్యతా ప్రమాణాలున్నాయా.? లేక కాంట్రాక్టర్లకు, అధికారులకు ప్రయోజనం చేకూర్చే వ్యవహారాలున్నాయా.? అన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. కమీషన్ల కోసమే సీసీ రోడ్లకు ప్రాధాన్యత ఇస్తున్నారా అన్న ఆరోపణలపై కమిషనర్ సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఉంది.

భూగర్భ జలాలకు ముప్పుగా మారుతున్న కాంక్రీట్ రోడ్లు

భవిష్యత్ తరాలపై కనీస అవగాహన లేకుండా నగరంలో ఎక్కడ చూసినా సీసీ రోడ్లు, కాంక్రీట్ నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. వర్షపు నీరు భూమిలోకి ఇంకేందుకు అవసరమైన అవకాశాలు ఏమాత్రం లేకపోవడంతో పర్యావరణ ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు పడిపోవడంతో బోర్లు వేయిల అడుగుల లోతుకు వేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో 1000 నుంచి 2000 అడుగుల లోతు వరకు బోర్లు వేయాల్సి వస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఈ పరిస్థితికి సీసీ రోడ్లే ఏకైక కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ వర్షపు నీటి ఇంకుడు, ఇంకుడు గుంతలు, పచ్చదనం పెంపుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం చాలా ఉంది.

పదేళ్లలోపే మళ్లీ రోడ్లు వేయాల్సిన దుస్థితి

నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్న సీసీ రోడ్లు కొద్ది సంవత్సరాలకే దెబ్బతింటున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రజాధనంతో నిర్మించిన రోడ్లు పదేళ్లు కూడా నిలవక మళ్లీ మరమ్మతులు, పునర్నిర్మాణాలకు గురవుతుంటే బాధ్యత ఎవరిది.? కాంట్రాక్టర్ల పనితీరును పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నాణ్యతా పరీక్షలు, థర్డ్ పార్టీ తనిఖీలు కాగితాలకే పరిమితమవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి దానితోపాటు కాంట్రాక్టర్లు అధికారులు కుమ్మక్కై కాంక్రీట్ రోడ్ల పేరుతో ప్రజాధనం పూర్తిగా దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వం సిసి రోడ్లను వేయవద్దని ఆదేశాలు ఇవ్వకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

తార్నాక,మెట్టుగూడలో ప్రజలకు రోడ్డు నరకం

ప్రజాప్రతినిధులకు కనిపించని ప్రజల కష్టాలు

మూడుసార్లు, ఐదుసార్లు గెలిచామని గొప్పలు చెప్పుకునే ప్రజాప్రతినిధులు నగర భవిష్యత్తుపై ఎలాంటి కార్యాచరణతో ముందుకు సాగుతున్నారన్న ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. మున్సిపల్ కమిషనర్లు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల నాణ్యతను పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం సైతం నగరాభివృద్ధి పనులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలి. కానీ అలాంటి పర్యవేక్షణ లేకపోవడం ఈ కాంక్రీట్ జంగల్ కు కారణంగా మారింది.సీసీ రోడ్డు వేశామా, బిల్లులు చెల్లించామా, కమిషన్లు తీసుకున్నామా అన్న చందంగా కాకుండా ప్రజలకు ఎన్ని రోజుల్లో రోడ్డు అందుబాటులోకి వస్తుంది.? ఎంతకాలం మన్నికగా ఉంటుంది.? వర్షపు నీరు భూమిలోకి ఇంకేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.? అన్న అంశాలపై సమాధానం చెప్పాలి. రోడ్ల నిర్మాణం పేరుతో ప్రజాప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులు ప్రజలకు నరకం చూపించే విధానానికి స్వస్తి పలికి, నాణ్యమైన పనులు చేపట్టి జీహెచ్ఎంసీ అధికారులు తమ బాధ్యతను నిరూపించుకోవాలని కమిషనర్లు సైతం ఈ సీసీ రోడ్ల వ్యవహారానికి స్వస్తి పలికి నగరానికి భూగర్భ నీటి వనరులు పెంచే విధంగా చూడాలని ఆశిద్దాం.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588